ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
ఏలూరు
జిల్లా వార్తలు
శనివారం 3 మే 2025

ప్రధానితో మాటామంతి


ప్రధాని నరేంద్రమోదీకి స్వాగతం పలుకుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు


ప్రధాని నరేంద్రమోదీకి అభివాదం చేస్తున్న కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్


రాష్ట్ర మంత్రి నారా లోకేశ్‌తో కేంద్ర మంత్రులు శ్రీనివాసవర్మ, పెమ్మసాని, రామ్మోహన్‌నాయుడు


అమరావతి సభలో మంత్రులు నిమ్మల రామానాయుడు, కొలుసు పార్థసారథి, అచ్చెన్నాయుడు తదితరులు




ప్రధాని నరేంద్రమోదీకి అభివాదం చేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రమ్ కిశోర్, ఉంగుటూరు, తాడేపల్లిగూడెం ఎమ్మెల్యేలు పత్సమట్ల ధర్మరాజు, బొలిశెట్టి శ్రీనివాస్

అమరావతి జయహో

ఉమ్మడి పశ్చిమ నుంచి తరలి వెళ్లిన వేలాది మంది


కలపర్రు టోల్ గేటు వద్ద అమరావతి సభకు వెళుతున్న బస్సులు


మర్రిబంధం వద్ద జెండా ఊపి వాహనాలను ప్రారంభిస్తున్న మంత్రి పార్థసారథి

- ఏర్పాట్లను పర్యవేక్షించిన మంత్రులు, ఎమ్మెల్యేలు.. సజావుగా సాగడంతో ఊపిరి పీల్చుకున్న అధికారులు

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

రాజధాని అమరావతి పునఃనిర్మాణ పనుల శంకుస్థాపన మహోత్సవానికి ఉమ్మడి పశ్చిమ నుంచి శుక్రవారం వేలా దిగా తరలివెళ్లారు. తెల్లవారుజాము నాటికే అమరావతి వెళ్లే వాహనాలు జాతీయ రహదారిపై భారీ సంఖ్యలో కన్పించాయి. ఉమ్మడి పశ్చిమ నుంచి ఉదయం ఏడు నుంచి 11 గంటల వరకు ఎడతెరిపి లేకుండా వాహనాలు వెల్లువలా సాగాయి.

కూటమి ప్రభుత్వం అమరావతికి వస్తున్న వారిపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చింది. స్థానిక ఎమ్మెల్యేలు ముందస్తు ప్రణాళికతో వ్యవహరించారు ఎవరికి ఏ లోటు లేకుండా వాహనాల వారీగా జాగ్రత్తలు తీసుకున్నారు. అమరావతి చేరుకోక ముందే అంతా భోజనం ముగించేలా జాగ్రత్త పడ్డారు. ప్రతి నియోజకవర్గం నుంచి వందలాది వాహనాలు బయలుదేరగా ఆ మేరకే ఎక్కడికక్కడ అందరికీ మజ్జిగ అందించారు. వాహనాల్లో పెద్దసంఖ్యలో వాటర్ బాటిళ్లను అందుబాటులో ఉంచారు. దెందులూరు నియోజకవర్గ ప్రజలకు గన్నవరం వద్ద ఓ ఫంక్షన్ హాలులో ఎమ్మెల్యే చింతమనేని దగ్గరుండి మరీ భోజనం వడ్డించారు. ఎవరికి కేటాయించిన వాహనాల్లో వారు వెళ్లి తిరిగి వచ్చేలా పరస్పర అవగాహనతో జాగ్రత్త పడ్డారు. అమరావతి సభను ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ఆ మేరకే గత వారం రోజులుగా నిర్విరామంగా క్షేత్రస్థాయి నుంచి సమీక్షలు సాగాయి. ఎవరెవరూ ఏఏ బాధ్యతలు స్వీకరించాలో పక్కాగా ప్రణాళికలు రూపొందించి అమలు చేశారు. మంత్రులు నియోజకవర్గాల నుంచి వాహనాలు ఉదయాన్నే ఉమ్మడిగా అమరావతి వైపు బయలు దేరాయి. ఈ వాహన శ్రేణికి మంత్రులు దగ్గరుండి జెండా ఊపి ముందుకు సాగనంపారు. ఎమ్మెల్యేలు సైతం ఇదే క్రమంలో జాగ్రత్తలు తీసుకున్నారు. ప్రతి వాహనంలోనూ సమృద్ధిగా భోజనం ప్యాకెట్లు సైతం అందుబాటులో ఉంచారు. దీనికి తోడు శుక్రవారం వేడిగాలులు తగ్గి వాతావరణం అనుకూలించడంతో ప్రయాణం సభ జరిగిన తీరు అంతా సాఫీగానే సాగిందని అమరావతికి వెళ్లిన వారంతా సంతృప్తిని వ్యక్తం చేశారు. ఉమ్మడి జిల్లా నుంచి కలెక్టర్లు ఆశించినట్లుగానే వాహన శ్రేణి ముందుకు సాగింది.


బస్సులో అమరావతి వెళుతున్న మహిళలు

ఊపిరి పీల్చుకున్న నేతలు

రాజధాని అమరావతి సభకు జిల్లా నుంచి పెద్దసంఖ్యలో ప్రజలు తరలివెళ్లడమే కాకుండా ఒక క్రమపద్ధతిలో ముందుకు సాగడం, వెనుతిరిగి రావడంతో నియోజకవర్గ నేతలు ఎమ్మెల్యేలతో పాటుగా అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. జిల్లావ్యాప్తంగా తరలివెళ్లిన వారంతా జరిగిన ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేయడం అధికారులకు నైతిక బలాన్నిచ్చింది. ఉంగుటూరు నియోజకవర్గం కైకరం వద్ద అమరావతికి వెళ్లి వస్తూ కాలకృత్యాలు తీర్చుకునేందుకు జాతీయ రహదారిపై రోడ్డు దాటుతున్న ఒక వ్యక్తి వ్యాన్ ఢీకొని దుర్మరణం పాలయ్యాడు.

కొల్లేరు.. కల్లోలం

దక్షిణాసియాలోని అతి పెద్ద మంచినీటి సరస్సు కొల్లేరు. ఇదంతా ఒకప్పటి మాట. రానురాను కొల్లేరు అంతర్భాగం ఆక్రమణలకు గురైంది. మంచినీటి స్థానే కలుషిత చేపలు పెరిగే నీరు చేరింది. ఈ సరస్సుకు పూర్వ వైభవం తెచ్చేందుకు కొన్నేళ్ల క్రితం అత్యున్నత న్యాయస్థానం జోక్యం చేసుకుంది. అయినప్పటికీ కొల్లేరు అనుకున్నంత పరిస్థితులు స్థిమితపడలేదు. సరస్సులో నీటి నిలువ, ఉప్పు నీరు చేరకుండా నిరోధానికి రెగ్యులేటర్ల నిర్మాణానికి ప్రతిపాదించి నిధులు కేటాయించినా పనులు ముందుకు సాగలేదు. వేలాది ఎకరాల విస్తీర్ణంలో నాలుగు నుంచి ఐదు టీఎంసీల నీరు నిలువ ఉండే మార్గాలు ఇప్పటికీ తెరుచుకోలేదు. వేసవి వస్తే చాలు బీటలు వారిన కొల్లేరు భూభాగం అన్నిచోట్ల కనిపిస్తోంది.


కైకలూరు రోడ్డులో చిన్నయడ్లగాడి వద్ద ఎండిపోయిన కొల్లేరు

నీరు లేక బీటలు వారిన సరస్సు

- కనిపించని పశు పక్ష్యాదులు.. జాడలేని రెగ్యులేటర్లు
- పట్టాలెక్కని గోదావరి జలాల మళ్లింపు ప్రతిపాదనలు

(ఏలూరు-ఆంధ్రజ్యోతిప్రతినిధి)

ఈ వేసవిలోను కొల్లేరు వట్టిపోయింది. చుక్కనీరు లేకుండా నేల బీటలు వారింది. పశుపక్ష్యాదులు నెలన్నర క్రితమే చెల్లాచెదురయ్యాయి. మత్స్య సంపద అణగారిపోయింది. వాస్తవానికి కొల్లేరులో ఏడాది పొడవునా నీటి నిలువకు వీలుగా రెండు దశాబ్దాలుగా పైగా అధికారంలో ఉన్న ప్రభుత్వాలు ప్రయత్నిస్తూనే వచ్చాయి. కానీ గత ఐదేళ్ల అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం రెగ్యులేటర్ల పేరిట నానా హంగామా చేసింది. ఎట్టి పరిస్థితుల్లోనూ రెగ్యులేటర్ల నిర్మాణం పూర్తి చేసే దిశగా 400 కోట్లకు పైగానే ప్రతిపాదిత పనులను ఆయా శాఖల ముందుంచింది. ఎన్నికల ముందు కొల్లేరు పరివాహక ప్రాంతంలో రెగ్యులేటర్ల నిర్మాణాన్ని ఎన్నికల హామీగా కూడా వాడేసుకుంది. ప్రజలను మభ్యపరిచేందుకు, రైతులను ప్రేరేపించేందుకు, స్థానికుల ఓట్లను దండుకునేందుకు వైసీపీ అన్ని విధాలా ప్రయత్నించింది. అయితే ఇదే తరుణంలో ఉంగుటూరు, ఉండి, కైకలూరు నియోజకవర్గాల్లో స్థానికుల సైతం రెగ్యులేటర్ల నిర్మాణం జరిగితే ఇక తమ జీవనశైలికి తిరుగుండదని భావించారు. కానీ అదేమి సాధ్యమే కాలేదు. కేవలం ప్రతిపాదించి కాగితాల మీద లెక్కలు చూపించి కోట్లాది రూపాయలను కేటాయించబోతున్నట్లు ఆశలు పెట్టి మరీ వైసీపీ అప్పట్లో పబ్బం గడుపుకుంది.

ఆదీ నుంచి ఇదే తీరు :

సాధారణంగా ఎవరికైనా ఇబ్బంది ఎదురైతే వీటిని కొల్లేరు కష్టాలుగా అభివర్ణిస్తారు. కానీ కొల్లేరులో కష్టాలు మాత్రం ఎన్నడూ తీరేటట్టు కనిపించలేదు. కొల్లేరులోకి ఉప్పుటేరు నుంచి సముద్రపు నీరు చేరకుండా, మత్స్యసంపద నష్టపోకుండా మంచినీరే ఉండేలా తెలుగుదేశం ప్రభుత్వం హయాంలోనే నానా హడావుడి చేశారు. ఆకివీడు సమీపాన రెగ్యులేటర్ నిర్మించడం ద్వారా సముద్రపు నీరు కొల్లేరులోకి ఎగబాకుండా అడ్డుకట్ట వేయాలనే ప్రయత్నాలు అప్పట్లో చురుగ్గానే సాగాయి. ఇదే తరుణంలో పోలవరం కుడి కాల్వ నుంచి కూడా గోదావరి నీరు కొల్లేరుకు చేర్చి ఆ మేరకు నిలువ ఉండేలా చూస్తే సమీప గ్రామాల భూగర్భజల మట్టం పెరగడమే కాకుండా కొల్లేరులోను ఉప్పు సాంద్రత పెరగకుండా కాపాడవచ్చునని అప్పట్లో సీనియర్ అధికారులు భావించారు. ఆ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రతిపాదించారు. ఇంకేముంది కొల్లేరు వైపు గోదావరి జలాలు అంటూ అందరూ ఊహాలోకంలో తేలియాడారు. ఈ ప్రతిపాదన కూడా ఇప్పటికీ కూడా ముందుకు కదలలేదు. గోదావరి జలాల ఊసే వినిపించలేదు. ఈ ప్రతిపాదన ఆచరణలోకి వచ్చి ఉంటే దాదాపు నాలుగు టీఎంసీల నీరు అలవోకగా సుమారు 56వేల ఎకరాల విస్తీర్ణంలో ఏడాది పొడవునా నిలువ ఉండేది.


ఏలూరు రూరల్ మండలం మాధవాపురం వద్ద ఎండిన కొల్లేరులో చనిపోయిన చేప

వేసవి వస్తే ఏడారే

వేసవి వచ్చిందంటే చాలు కొల్లేరు చుక్కనీరు కూడా నిలువ ఉండే పరిస్థితి లేదు. తమ్మిలేరు, రామిలేరు, బుడమేరు. ఎర్రకాల్వల నుంచి వచ్చే నీటి ప్రవాహాలు వేసవిలో ఎలాగో ఉండవు. దీంతో కొల్లేరులో ఏ మూలన చూసిన నెర్రలిచ్చిన ప్రాంతాలే కనిపిస్తాయి. విదేశీ పక్షులతో పాటు మిగతా పక్షులు కూడా మటుమాయం అవుతాయి. కేవలం కొల్లేరు భూభాగం బీటలు వారడంతో మత్స్యసంపద కూడా అదృశ్యమైవుతుంది. ఈ వేసవిలో కూడా అదే జరిగింది. రెగ్యులేటర్ నిర్మాణం పూర్తి చేసే ఉంటే ఈ పరిస్థితి నుంచి విముక్తి కల్పించవచ్చు.

ఆర్థిక ఇబ్బందులతో ఫైనాన్స్ వ్యాపారి ఆత్మహత్య
■ లోపలి పేజీలో..

నీట్-యూజీ పరీక్షకు 'అరగంట ముందే గేట్ క్లోజ్'

ఏలూరు అర్బన్, మే 2 (ఆంధ్రజ్యోతి) : ఎంబీబీఎస్, బీడీఎస్, తదితర వైద్యవిద్యా కోర్సుల్లో ప్రవేశాలకు జాతీయస్థాయిలో ఈనెల 4న జరగనున్న నీట్- యూజీ పరీక్షకు జిల్లాలో హాజరయ్యే విద్యార్థులు పాటించాల్సిన మార్గదర్శకాలపై డీఈవో వెంకటలక్ష్మమ్మ, నీట్ సిటీ కో-ఆర్డినేటర్ భూర్‌సింగ్ మీనా శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పేపర్,పెన్ విధానంలో జరిగే నీట్-యూజీ పరీక్ష జిల్లాలో గోపన్నపాలెంలోని కేంద్రీయ విద్యాలయం, ప్రభుత్వ ఉన్నతపాఠశాల, ఏలూరులోని సుబ్బమ్మదేవి మున్సిపల్ హైస్కూలు, కస్తూరిబా మున్సిపల్ బాలికోన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఆదివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు జరుగుతాయన్నారు. పరీక్షకు హాజరయ్యే విద్యా ర్థులు హాల్‌టిక్కెట్‌తో పాటు, ఒక ఫొటో గుర్తింపుకార్డు, రెండు కలర్ పాస్‌పోర్టుసైజు ఫొటోలు, ఒక పోస్టుకార్డుసైజు కలర్ ఫొటోను తప్పనిసరిగా తెచ్చుకోవాలని సూచించారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంటన్నర వరకు మాత్రమే పరీక్ష కేంద్రంలోకి విద్యార్థులను అనుమతిస్తారని స్పష్టం చేశారు. ఆ మేరకు మధ్యాహ్నం ఒంటిగంటన్నర తర్వాత ఒక్క నిమిషం ఆలస్యమైనా లోపలికి అనుమతించరని వివరించారు. లంచ్‌బాక్సులు, టిఫిన్‌బాక్సులు, తినుబండారాలు అనుమతించనందున విద్యార్థులు భోజనం చేసి పరీక్షకు హాజరుకావాలన్నారు. బంగారు ఆభరణాలు/వెండి మొలతాళ్లు/తాయెత్తులు ధరించరాదని స్పష్టం చేశారు. చేతి గడియారాలు, ఎలక్ట్రానిక్ గాడ్జెట్‌లు, పెన్, పెన్సిల్, షార్పనర్, ఎరేసర్‌లను తీసుకురావద్దని కోరారు. పారదర్శకమైన నీటి బాటిల్‌ను విద్యార్థులు తమవెంట తెచ్చుకోవచ్చన్నారు. పరీక్ష పూర్తయిన తర్వాత ప్రశ్నపత్రాన్ని తమ వెంట తీసుకెళ్ల వచ్చని వివరించారు. పెన్‌ను పరీక్ష కేంద్రంలోనే ఇస్తారని తెలిపారు.

జడ్పీ ఉద్యోగులకు పదోన్నతి
■ లోపలి పేజీలో..

మన్యంలో బంద్ సక్సెస్

గిరిజన డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలకు డిమాండ్

ప్రత్యేక గిరిజన నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరుతూ గిరిజన సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టిన రాష్ట్రవ్యాప్త ఏజెన్సీ బంద్ పశ్చిమ ఏజెన్సీ మండలాల్లో విజయవంతమైంది. వ్యాపార సంస్థలు, దుకాణాలు, ప్రైవేటు కార్యాలయాలు, పెట్రోల్ బంకులు స్వచ్ఛందంగా మూసివేసి బంద్‌కు మద్దతు తెలిపారు. ఆర్టీసీ బస్సులు నిలిచిపోయాయి.


పోలవరంలో మానవహారం

బుట్టాయగూడెం/పోలవరం/కుక్కునూరు/వేలేరుపాడు/జీలుగుమిల్లి, మే 2(ఆంధ్రజ్యోతి):బుట్టాయగూడెం బస్టాండ్ సెంటరులో గిరిజన, ప్రజా సంఘాలు, సీపీఎం నాయకులు రోడ్లపై బైఠాయించి రాస్తారోకో చేసి నిరసన తెలిపారు. ఆందోళనకు సీపీఎం మద్దతు తెలిపింది. బుట్టాయగూడెంలో నాయకులు ఎ.రవి, ఎం.నాగమణి, ఎ.ఫ్రాన్సిస్ మాట్లాడుతూ జీవో నెంబరు 3 రద్దు కావడంతో గిరిజన నిరుద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం విడుదల చేసిన మెగా డీఎస్సీలో గిరిజనులకు తీరని అన్యాయం జరుగుతోందన్నారు. ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు తెల్లం రామకృష్ణ, టి.రామకృష్ణ, పి.నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం గిరిజనులకు ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. పోలవరం మండలంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కారం భాస్కర్, సీపీఎం ఆధ్వర్యంలో జరిగిన మన్యం బంద్‌లో భాగంగా ఏటిగట్టు సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. జిల్లా ఉపాధ్యక్షులు బొరగం భూచంద్రం, మడివి చలపతి తదితరులు పాల్గొన్నారు. కుక్కునూరులో సీపీఎం మద్దతు పలికింది. గిరిజన సంఘ నాయకులు శ్యామల లక్ష్మణరావు, వి.లక్ష్మయ్య, వలి భాష, వెంకటేశ్వర్లు, శ్రీను, తదితరులు పాల్గొన్నారు. వేలేరుపాడు మండల వ్యాప్తంగా బంద్ నిర్వహించారు. అన్ని గిరిజన సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. జీలుగుమిల్లిలో దుకాణదారులు స్వచ్ఛందంగా బంద్ పాటించారు. సీపీఎం మండల కార్యదర్శి తెల్లం దుర్గారావు, గిరిజన సంఘం నాయకులు తెల్లం సంకురుడు, కారం దుర్గ, గుడెల్లి వెంకట్రావు, సీహెచ్ కొండలరావు పాల్గొన్నారు.


బుట్టాయగూడెంలో రాస్తారోకో


కుక్కునూరులో నిర్మానుష్యంగా ప్రధాన రహదారి


వార్లకోడు డ్రెయిన్ వెంబడి సర్వే నిర్వహిస్తున్న రెవెన్యూ, గ్రామ పంచాయతీ అధికారులు

కైకలూరులో ఆక్రమణలపై సర్వే

కైకలూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): కైకలూరు పట్టణంలో రహదారులు, డ్రెయినేజీల ఆక్రమణలపై అధికారులు సర్వే నిర్వహించి తొలగించేందుకు రంగంలోకి దిగారు. శుక్రవారం కైకలూరు బైపాస్‌రోడ్డులో వార్లకోడు డ్రెయిన్‌పై సర్వే నిర్వహించారు. డ్రెయిన్ ఆక్రమణలకు గురవుతున్నట్టు గత నెల 26న 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైన విషయం విదితమే. వార్లకోడు వెంబడి ప్రహరీల నిర్మాణం చేయడంతో వర్షాకాలంలో ముంపునీరు పారుదలకు అవరోధంగా మారే అవకాశం ఉండడంతో సర్వే చేసి తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. బైపాస్‌రోడ్డులో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి నిర్మాణం చేసిన భవనాలను సైతం సర్వే చేశారు. ప్రభుత్వ స్థలాల్లో ఆక్రమణలను స్వచ్ఛందంగా తొలగించుకోవాలని లేకుంటే అధికారుల ఆధ్వర్యంలో తొలగిస్తామని హెచ్చరించారు. కైకలూరులో ఎక్కడ ఆక్రమణలకు పాల్పడిన సర్వే నిర్వహించి తొలగిస్తామని పంచాయతీ కార్యదర్శి ఆనందభూషణం తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ వీఆర్వోలు, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.





పవన్ స్వాగతం.. లోకేశ్ మోదీ చమత్కారం

అద్భుతంగా అమరావతి

అద్వితీయంగా శంకుస్థాపన వేడుక ● రాజధాని గ్రామాల్లో తిరునాళ్ల సందడి

వినాశనం నుంచి వికాసం దిశగా.. అమరావతి పరుగులు పెట్టేందుకు సిద్ధమైంది. శిథిలం నుంచి ప్రపంచం అచ్చెరువొందేలా ఆంధ్రుల కలల రాజధాని పునర్నిర్మాణం దిశగా పయనించనున్నది. ఈ అపురూప కార్యక్రమానికి శుక్రవారం రాజధాని పరిధిలోని వెలగపూడి వేదికగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ శ్రీకారం చుట్టారు. అమరావతి అభివృద్ధి మనమే చేయాలి.. మనమే చేస్తాం.. అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సాక్షిగా పిలుపిచ్చారు. దేవతల రాజధాని అమరావతి దేశాభివృద్ధికి కేంద్రంగా మారుతోం దని.. ఆ స్థాయిలో అభివృద్ధి చేస్తామని మోదీ ప్రజల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. ఇక అమరావతి కేంద్రంగా వివిధ ప్రాజెక్టులతో పాటు రాష్ట్రంలోని పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ప్రధాని మోదీ వివిధ ప్రాజెక్టులను ప్రారంభించి జాతికి అంకితం చేశారు. పునర్నిర్మాణ శంకుస్థాపన మహోత్సవానికి అతిరథ మహారథులతో పాటు ప్రధాన మంత్రి మోదీ రాకతో రాజధాని గ్రామాల్లో తిరునాళ్ల వాతావరణం సంతరించుకుంది. రాష్ట్రవ్యాప్తంగా తరలివచ్చిన జనాలతో రాజధానిలో పండుగ వాతావరణం కనిపించింది. - తుళ్లూరు, ఆంధ్రజ్యోతి



కాజ టోల్ గేట్ వద్ద బారులు తీరిన వాహనాలు





సభ ప్రాంగణంలోనే వైద్య సేవలు



మహిళల విజయ దరహాసం





దుర్గ గుడి నుంచి సభా వేదిక వద్దకు సైకిల్‌పై వస్తున్న విజయనగరం ఎంపీ అప్పల నాయుడు



సభా వేదిక వద్దకు తరలివస్తున్న విద్యార్థినులు



సభా వేదిక వద్ద ఏర్పాటు చేసిన భోజనాలు



గ్యాలరీల బయట జనం





కబడ్డీ.. కబడ్డీ

భారత జట్టు ప్రోపబుల్స్‌లో తాడేపల్లిగూడెం పోస్టల్ ఉద్యోగి గౌరి



సవాళ్లను అధిగమించి కబడ్డీలో రాణించింది. స్పోర్ట్స్ కోటాలో పోస్టల్ శాఖలో ఉద్యోగం సాధించింది. విధులు నిర్వహిస్తూనే జాతీయ కబడ్డీ జట్టులో ప్రోబబుల్స్ 19 మంది సభ్యుల్లో ఒకరిగా ఎంపికైంది. విశాఖ జిల్లా ఎండాడకు చెందిన కొప్పాన గౌరి తాడేపల్లిగూడెం పోస్టాఫీస్‌లో పని చేస్తున్నారు. జాతీయ జట్టుకు ఎంపికైన రాష్ట్రానికి చెందిన ఏకైక క్రీడాకారిణి ఆమె. గౌరి తండ్రి చిరుద్యోగం చేస్తున్నారు. అమ్మ డెయిరీ వ్యాపారం. నలుగురు కుమార్తెలలో గౌరి చిన్న కుమార్తె.

తాడేపల్లిగూడెం రూరల్, మే 2 (ఆంధ్ర జ్యోతి): జాతీయ జట్టు ప్రోపబుల్స్‌లో ఒకరిగా ఎంపికైన గౌరి తన క్రీడా ప్రస్థానం, సాధించిన విజయాలు ఆంధ్రజ్యోతితో పంచుకున్నారు. ఆమె మాటల్లోనే..

మా సొంతూరు విశాఖలోని ఎండాడ. నాన్న అప్పారావు ఆర్టీసీ ఉద్యోగి, అమ్మ లక్ష్మి ఇంటి వద్దే డెయిరీ వ్యాపారం చేస్తూ మా నలుగురు అక్కా చెల్లెళ్లను చదివించారు. అక్క వాళ్లలో నేను ప్రత్యేకం. మా నాన్నకు నేనే కొడుకు. నాకు చిప్పన్నటి నుంచి క్రీడలంటే మక్కువ. పదో తరగతి వరకూ డ్రిల్ సమయంలో స్నేహితులతో కలిసి సరదాగా ఆడేదాన్ని. మా పెద్ద అక్క వాలీబాల్ క్రీడల్లో పాల్గొనడం టోర్నమెంట్‌లకు వెళ్లడంతో నాకు ఆసక్తి పెరిగింది. ఇంటర్‌కు వచ్చాక కబడ్డీ ఆడడం ప్రారంభించాను. నా ప్రతిభను గుర్తించి శిక్షకులు నన్ను టోర్నమెంట్‌లకు తీసుకెళ్లారు. నాన్న ప్రోత్సహించడం మరింత ఉత్సాహం కలిగింది. మంచి ఫలితాలు రావడంతో కబడ్డీపై నాకు మరింత ఆసక్తి పెరిగింది.

> శాయ్‌కు ఎంపిక కావడం నా జీవితాన్ని మలుపు తిప్పింది. అప్పటి నుంచి కబడ్డీ నా జీవితంగా మారింది. రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికై కబడ్డీ ఒక ప్రపంచం అయిపోయింది.

రాష్ట్రంలో క్రీడలకు ఆదరణ తక్కువ

స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగం కోసం వేచి చూడాల్సిన పరిస్థితి. స్నేహితుల సలహాతో వెస్ట్ బెంగాల్‌లో స్పోర్ట్స్ కోటాలో 2021లో ఉద్యోగానికి దరఖాస్తు చేసుకోగా పోస్టల్ అసిస్టెంట్‌గా ఉద్యోగం లభించింది. అక్కడే ఉద్యోగం చేస్తూ ఆరు నెలల క్రితం మ్యూచ్‌వల్ ట్రాన్స్‌ఫర్ కింద తాడేపల్లిగూడెం పోస్టల్ కార్యాలయంలో చేరాను. ప్రైవేటు ఉద్యోగి అయిన నా భర్త రాంబాబు ప్రోత్సాహంతో క్రీడల్లో రాణిస్తున్నా. గత ఏడాది ఏషియన్ చాంపియన్ షిప్‌లో ఆడే అవకాశం లభించినా పాస్‌పోర్ట్ ఇబ్బంది వల్ల వెళ్లలేకపోయాను. ప్రస్తుతం ప్రోపబుల్స్ నుంచి జాతీయ జట్టులో ఆడి దేశ పతాకాన్ని రెపరెపలాడించాలన్నది నా కల.

> మొత్తం 20 జాతీయ, రాష్ట్రస్థాయి పోటీల తోపాటు బీచ్ కబడ్డీలో ప్రతిభ కనబరిచాను. 2013లో బంగ్లాదేశ్‌లో జరిగిన అంతర్జాతీయ కబడ్డీ పోటీల్లో బంగారు పతకం, 2018లో సీనియర్ నేషనల్స్‌లో కాంస్య పతకం, బీచ్ కబడ్డీలో రజత పతకం, సౌత్ జోన్‌లో బంగారు పతకం సాధించాను.

వాహ నిజం!

ఇతగాడి మేనరిజం

కలలు కనండి..వాటిని నిజం చేసుకోండి.. మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం చెప్పిన మాట.. ఆ మాటను ఆచరించే యువత కోకొల్లలు.. ఆ కోవలోకే వస్తాడు రాజ్‌కుమార్.. పుట్టింది కుగ్రామంలో అయినా చిన్నతనం నుంచి ఏదో ఒకటి కొత్తగా చేయాలనే తపన.. అందులో నుంచి పుట్టిందే విభిన్న ఆకారాల్లో వాహనాల రూపకల్పన.. చిన్నతనం కార్లు అంటే చాలా ఇష్టం.. అది మామూలు కార్లు కాదండోయ్.. ఇటీవల కల్కి సినిమాలో బుజ్జి కారు చూశారా.. అలా ఉండాలి.. మరి అటువంటి కార్లు మార్కెట్‌లో లభ్యమవుతాయా.. కష్టమే కదా.. ఉన్నా కొనలేం. అందుకే తన బుర్రకే పదును పెట్టాడు.. ఇదిగో ఇలా తన వద్ద ఉన్న పరికరాలతోనే తనకు నచ్చినట్టు వాహనాలు తయారుచేసుకుని అందరినీ ఆశ్చర్యపరుస్తున్నాడు.. యూట్యూబ్ చానల్ వేదికగా వీక్షకులతో శెహబాష్ అనిపించుకుంటున్నాడు.. - పి.గన్నవరం-ఆంధ్రజ్యోతి



డబుల్ సైకిల్‌పై సవారీ..



కారుగా మారిపోయిన యాక్టివా...

సోషల్ మీడియా నేటి తరం యువతకు ఒక అద్భుత వేదిక.. వారిలో ఉన్న టాలెంట్‌ను ఎవరూ గుర్తించనక్కర్లెద్దు.. వారే గుర్తించి.. అవకాశాలను అందిపుచ్చుకోవచ్చు.. ప్రస్తుతం సోషల్ మీడియా వేదికగా యువత ఇదే చేస్తున్నారు. వారి నైపుణ్యాలను వివిధ రకాలుగా ప్రదర్శిస్తున్నారు. కొందరు వీడియో లు తీసి సోషల్‌మీడియా ద్వారా తమ ప్రతిభను ప్రపంచానికి తెలియజేస్తున్నారు. ఇటీవల కాకినాడకు చెందిన అమ్మాయి ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టల ద్వారా పాపులరై కోర్టు సినిమాలో హీరోయిన్ క్యారెక్టర్ కొట్టేసింది. కోనసీమ జిల్లా సరిహద్దులోని ఆచంట మండలం నక్కిడిలంక యువకుడు రాజ్‌కుమార్.. పరిసరాల్లో దొరికే వస్తువులతో వింతవాహనాలు తయారుచేస్తూ ఆ వీడియోలను యూట్యూబ్‌లో ఔరాఅనిపిస్తున్నాడు.



- పల్లెటూరులో కొత్త..కొత్తగా..షికారు!
- విభిన్న ఆకారాల్లో వాహనాల రూపకల్పన
- చేసింది డిప్లమో అయినా వినూత్నంగా ఆలోచన
- వీక్షకులను ఆకట్టుకుంటున్న నక్కిడిలంక యువకుడు
- 'కోనసీమ సరదాలు' పేరుతో యూట్యూబ్ ఛానల్

గల్ఫ్ వెళ్లొచ్చి..

కోనసీమజిల్లా సరిహద్దు ప్రాంతానికి చెందిన ఆచంట మండలం గోదావరి మధ్యలోని గ్రామం నక్కిడిలంక.. అక్కడ ఒక గ్రామం ఉందని బయట ప్రపంచానికి తెలియడం చాలా అరుదు.. ఎందుకంటే లంక గ్రామం కావడంతో పరిసర గ్రామాల వారికే అవగాహన ఉంటుంది.ఆ గ్రామానికి చెందిన యువకుడు రాజ్‌కుమార్ వినూత్న వాహనాల రూపకల్పన చేసి అందరినీ ఆశ్చర్యపరుస్తున్నాడు. అమలాపురం బీవీసీ కళాశాలలో డిప్లమో పూర్తి చేసి ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లి పోయాడు. తిరిగి వచ్చిన తర్వాత తనకు ఉన్న నైపుణ్యంతో వినూత్న వాహనాలను తయారు చేసి యూట్యూబ్ ద్వారా ప్రపంచానికి చూపించాలన్న ఆలోచనతో ఇటీవలే 'కోనసీమ సరదాలు' పేరుతో ఛానల్ ప్రారంభించాడు. సాంకేతిక పరమైన అంశాలను దృష్టిలో ఉంచుకుని తనకు ఉన్న పరిజ్ఞానంతో తన ప్రయత్నాన్ని సఫలం చేసుకుంటున్నాడు.



యువకుడు తయారు చేసిన వెదురుబొంగుల పడవ


కొత్తకొత్తగా ఇలా..

తన స్నేహితుడు మనోజ్ సాయంతో రాజ్‌కుమార్ ఇప్పటి వరకు నాలుగు వినూత్న వాహనాలు తయారు చేశాడు. ఎదురుబొంగులు, ప్లాస్టిక్ కవర్ల సాయంతో పడవను తయారు చేసి వశిష్ఠ నదీ పాయలో విహారం చేశాడు. ఒక సైకిల్‌పై మరో సైకిల్‌ను జోడించి వాటి మధ్య వెల్డింగ్‌తో ఎత్తయిన సైకిల్‌గా రూపకల్పన చేసి గ్రామంలోని రోడ్లపై తొక్కాడు. ఒకేసారి ఐదుగురు ప్రయాణం చేసేలా పొడవాటి స్కూటీని తయారు చేసి సీసీ రోడ్లపై ప్రయాణం చేశాడు. ఇప్పుడు మరో అడుగు ముందుకు వేసి స్కూటీ సాయంతో బగ్గి వాహనం(చిన్నకారు) తయారు చేసి రోడ్డుపైకి వచ్చాడు. వాహనాల తయారీలో వెల్డింగ్ దగ్గర నుంచి బిగించే వరకు అన్నీ అతడే స్వయంగా చేసుకోవడం విశేషం. ఒక్కసారి చేసిన వాహ నాన్ని తన యూట్యూబ్ కోసం వీడియో చేసిన తర్వాత నిర్వీర్యం చేస్తాడు.ఆ వస్తువులనే మళ్లీ నూతన వాహనం తయారీకి వినియోగిస్తాడు. ఇలా అద్భుతంగా తీర్చిదిద్దుతాడు. వాహనాలపై పల్లె రోడ్లపై తిరుగుతూ రీల్స్ చేసి వాహ్‌వా అనిపించుకుంటున్నాడు.

పనిలోనే ఆనందం వెతుక్కుంటున్నా : రాజ్‌కుమార్



నాకు చిన్నతనం నుంచి వాహనాలంటే చాలా ఇష్టం.. ఎక్కడైనా కొత్త వాహనాలు కనిపిస్తే తరచి తరచి చూడడం అలవాటు..చిరంజీవి పాత సినిమాల్లో చూస్తే చాలా వాహనాలు కనిపించేవి.. వాటిని మైండ్‌లో పెట్టుకునేవాడిని..ప్రస్తుతం నా వాహనాలకు అదే ప్రేరణ.. పాత వాహనం తీసుకుని దాన్ని రీమోడల్ చేస్తా. డిప్లమో అయిన తర్వాత ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లిపోయా. అక్కడ పనిచేసేవాడినే కానీ ఏదో తెలియని వెలితి.. ఎందుకొచ్చిన గొడవ అని వచ్చేశా.. నా టాలెంట్‌నే పెట్టుబడిగా పెట్టి వాహనాలు తయారుచేస్తున్నా.. ఆనందంగా ఉంది.



ఇది లోకల్ మేడ్ వాహనం.. ఎలా ఉందో చూశారా.. ఐరన్ బద్దలు.. యాక్టివా ఇంజన్.. టైర్లు అమర్చి ఐదుగురు ప్రయాణించేలా వాహనం ఇలా..

నేత్రపర్వం.... చాత్మార్ ఉత్సవం


తిరువీథులకు స్వామి, అమ్మవార్లు

ద్వారకాతిరుమల, మే 2 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి చాత్మార్ ఉత్సవం శుక్రవారం రాత్రి తిరువీధుల్లో వైభవంగా జరిగింది. శ్రీమద్రామానుజుల తిరు నక్షత్రం సందర్భంగా స్వామి వారు ఉభయదేవేరులతో కలసి పురవీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ముందుగా శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాస మూర్తిని తొళక్క వాహనంపై ఉంచి అర్చకులు ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. అనంతరం మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ ప్రధాన రాజగోపురం మీదుగా గ్రామంలోకి బయలుదేరారు. ప్రతీ ఇంటి ముందు ఉత్సవమూర్తులకు భక్తులు హారతులు పట్టారు.

బ్రహ్మోత్సవ ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ


ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న ఆలయ చైర్మన్ సుధాకరరావు, ట్రస్టీ నివృతరావు

ద్వారకాతిరుమల, మే 2 (ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమలలో ఈనెల 7నుంచి ప్రారంభం కానున్న శ్రీవారి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికలను ఆలయ చైర్మన్ రాజా ఎస్వీ సుధాకరరావు, ఆలయ అధికారులు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ నెల 7 నుంచి 14వరకూ వైఖానస ఆగమయుక్తంగా ఉత్సవాలను నిర్వహించేందుకు చైర్మన్ పర్యవేక్షణలో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్సవ ఆహ్వాన పత్రికను చైర్మన్, ఆయన కుమారుడు అనువంశిక ధర్మకర్త ఎస్వీ నివృతరావు, ఆలయ డిప్యూటీ ఈవో బాబూరావు, ఏఈవో పి.నటరాజారావు ఆవిష్కరించారు. స్వామి వారి కల్యాణోత్సవాలకు ప్రజాప్రతినిధులు, అధికారులను ఆహ్వానించనున్నారు.

బ్రహ్మోత్సవ కార్యక్రమాలు

బ్రహ్మోత్సవాల్లో ఈ నెల 7న ఉదయం స్వామి, అమ్మవార్లను వధూవరులుగా అలంకరిస్తారు. 8న ధ్వజారోహణ, 10న ఎదుర్కోలు ఉత్సవం, 11న రాత్రి 8.30 గంటలకు శ్రీవారి తిరుకల్యాణ మహోత్సవం నిర్వహిస్తారు. 12న రాత్రి 7.30 గంటలకు రథోత్సవం, 13న శ్రీచక్రవార్యుత్సవం, ధ్వజావరోహణ, 14న ఉదయం చూర్ణోత్సవం, వసంతోత్సవం, రాత్రి జరిగే ద్వాదశ కోవెల ప్రదక్షిణలు, శ్రీపుష్ప యాగోత్సవంతో ఉత్సవాలు పరిసమాప్తం కానున్నాయి. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఉదయం, సాయంత్రం వాహన సేవలుంటాయి.


ఉద్యోగులకు పదోన్నతి ఉత్తర్వులు అందజేస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ

జడ్పీ ఉద్యోగులకు పదోన్నతి

ఏలూరు సిటీ, మే 2(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ ఉద్యోగులకు పదోన్నతులు కల్పిస్తూ జారీ చేసిన ఉత్తర్వులను జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ శుక్రవారం అందజేశారు. ముగ్గురు అడ్మినిస్ట్రేటివ్ అధికారులకు ఎంపీడీవోలుగా, సీనియర్ అసిస్టెంట్లకు అడ్మినిస్ట్రేటివ్ అధికారులుగా పదోన్నతి కల్పించారు. పదోన్నతి పొందిన ఉద్యోగులను చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అభినందించారు. ప్రజలకు అత్యంత నిబద్ధతతో సేవలందించాలని సూచించారు. ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి తీసుకుంటున్న చర్యల్లో వారు తమ విశేషమైన పాత్రను పోషించాలన్నారు. పదోన్నతి పొందిన అధికారులు కృతజ్ఞతలు వ్యక్తం చేస్తూ ప్రజలకు ఉత్తమ సేవలు అందించేందుకు అన్ని విధాలుగా శ్రద్ధ వహిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

రెమిడియల్ క్లాసులపై ఉత్తర్వులు ఇవ్వాలి

ఏలూరు అర్బన్, మే 2 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఫెయిలైన విద్యార్థులకు రెమిడియల్ తరగతుల నిర్వహణకు హాజరుకాలేని ఉపాధ్యాయులకు జీతభత్యాలను నిలిపివేయడంతోపాటు, క్రమశిక్షణాచర్యలు తీసుకోవాలని ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలు జారీచేయడాన్ని నిరసిస్తూ అన్ని ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) జిల్లా నాయకులు శుక్రవారం డీఈవో వెంకటలక్ష్మమ్మను కలుసుకుని తమ అభ్యంతరాలను తెలియజేసారు. ఫ్యాప్టో సభ్యసంఘాల నాయకులు మోహన్‌రావు, ఆదినారాయణ మాట్లాడుతూ రెమిడియల్ క్లాసులకు హాజరయ్యే టీచర్లకు ఎర్న్ లీవులు ఇవ్వాలని గతనెల 25న తాము లిఖిత పూర్వకంగా అభ్యర్థించినప్పటికీ ఇంతవరకు పట్టించుకోలేదన్నారు. మళ్లీ ఇపుడు క్లాసులకు హాజరుకాని ఉపాధ్యాయులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించడం సబబు కాదన్నారు. వేసవి సెలవుల్లో రెమిడియల్ క్లాసులకు హాజరు కావాలని ఆదేశిస్తూ డీఈవో లిఖితపూర్వక ఉత్తర్వులిస్తే తరగతులకు ఉపాధ్యాయులు హాజరయ్యేందుకు ఎటువంటి అభ్యంతరాలు చెప్పబోరని ఫ్యాప్టో నాయకులు స్పష్టం చేశారు. తమ అభ్యర్థనపై డీఈవో సానుకూల ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. డీఈవోను కలిసిన ఫ్యాప్టో సభ్యసంఘాల నాయకుల్లో వెంకటేశ్వరరావు, రామారావు, సామ్యూల్, రెడ్డిదొర, రవికుమార్, శివరామ్, ప్రకాశరావు, తదితరులున్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


యనమదుర్రు డ్రెయిన్‌పై నిర్మించిన వంతెన వద్ద కంకర గుట్టలు

యనమదుర్రు వంతెన పనులు

పాలకోడేరు, మే 2 (ఆంధ్రజ్యోతి): యనమదుర్రు డ్రెయిన్‌పై వంతెన మరమ్మతు పనుల్లో జాప్యంపై 'నిర్లక్ష్యం' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో శుక్రవారం ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. వంతెనపై శ్లాబ్ నిర్మించేందుకు మెటల్‌తోపాటు వంతెనపై ఐరన్ రాడ్లను వేసేందుకు సన్నద్ధమయ్యారు. వంతెన పనులకు మరమ్మతుల కారణంగా ఏప్రిల్ 10 నుంచి 30 వరకు రాకపోకలను నిలిపివేశారు. తర్వాత కూడా పనులు పూర్తికాకపోవడంతో ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వంతెనపై శ్లాబ్ నిర్మాణానికి శుక్రవారం మెటల్, ఐరన్ దించడంతో ప్రయాణికులు కాస్త ఊపిరి పీల్చుకున్నారు. త్వరితగతిన వంతెన మరమ్మతులు చేపట్టి ఇబ్బంది లేకుండా చూడాలని ప్రయాణికులు కోరుతున్నారు.

చెల్లింపులన్నీ ఆన్‌లైన్




2016 నవంబరు 8, ప్రజలు మరచిపోలేని ఒకరోజు. పెద్దనోట్లు రద్దు చేస్తూ ప్రధాని మోదీ సంచలనాత్మక నిర్ణయం తీసుకున్న రోజది. నల్లడబ్బును వెలికితీయడం ఉగ్రవాదానికి ఊతమిస్తున్న నకిలీ కరెన్సీని అదుపుచేయడం స్విస్ బ్యాంకులో మూలుగుతున్న లక్షల కోట్లు రూపాయలు వెనుకకు రప్పించడం. అదే సమయంలో నగదు రహిత లావాదేవీలను పెంచటం లక్ష్యంగా ప్రధాని తీసుకున్న నిర్ణయం భిన్న ఫలితాలనిచ్చాయి. పెద్ద నోట్లు రద్దు తొలినాళ్లలో సామాన్య పౌరులు నగదుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రూ.500, రూ.1000నోట్లు రూ.16 లక్షల కోట్లు రద్దు చేసి ఆ వెంటనే కేవలం రూ.5లక్షల కోట్లు రిజర్వు బ్యాంకు విడుదల చేయడంతో సుమారు రెండేళ్లపాటు పౌరులు నగదు కష్టాలు ఎదుర్కొన్నారు. అనంతరం కొద్దికొద్దిగా నగదు కష్టాలు తగ్గి ఆన్‌లైన్ లావాదేవీలు ఊపందుకున్నాయి.

- పాలకొల్లు, ఆంధ్రజ్యోతి

- పెరిగిన డిజిటల్ లావాదేవీలు
- చాయ్ తాగితే ఆన్‌లైన్ పేమెంట్
- రూ.10 బిస్కెట్ ప్యాకెట్‌కు ఫోన్ చెల్లింపు
- పెద్ద మొత్తాలైతే బ్యాంకులకు బదిలీ
- 80శాతం ఆన్‌లైన్ లావాదేవీలే
- విపణిలో తగ్గిన నగదు చలామణీ
- ప్రధానంగా చిల్లర సమస్యకు చెక్
- చిరు అవసరాలకు నగదు ఇబ్బందులు
- సంపన్నుల లాకర్లలో నగదు నిల్వలు



డ్రాప్ టీ తాగితే రూ.5 ఫోన్‌పే..
రూ.10 బిస్కెట్ ప్యాకెట్‌కు గూగుల్ పే..

ఒకటి రెండూ కాదు. చిన్నాపెద్దా తేడాలేదు అన్ని వ్యాపార కేంద్రాలు వద్ద క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి సంబంధిత మొత్తం ట్రాన్స్‌ఫర్ చేస్తున్నారు. నగదు పెద్ద మొత్తంలో బదిలీ చేయాలంటే ఐఎంపీఎస్ (ఇమ్మిడియేట్ పేమెంట్ సర్వీస్), నెఫ్ట్ (నేషనల్ ఎలక్ట్రానిక్ ఫండ్ ట్రాన్స్‌ఫర్), ఆర్‌టీజీఎస్ (రియల్ టైమ్ గ్రాఫ్ సెటిల్‌మెంట్) విధానాలలో నగదు బదిలీ చేస్తున్నారు. ఐఎంపీఎస్ ద్వారా రూ.5 లక్షలు, నెఫ్ట్ ద్వారా రూ.2 లక్షలు, అంతకు మించి చేయొచ్చు. ఆర్‌టీజీఎస్ ద్వారా రూ.2లక్షలు నుంచి ఎన్ని కోట్లు అయినా బదిలీ చేయొచ్చు.

ఇప్పుడు విపణిలో 80శాతం మేరకు ఆన్‌లైన్ లావాదేవీలు జరుగుతున్నాయి. పట్టణ ప్రాంతాలు, నగరాలలో పెద్దగా ఇబ్బంది లేనప్పటికీ గ్రామీణ ప్రాంతాలలో నగదుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వ్యవసాయ కార్మికులు, అసంఘటిత రంగ కార్మికులకు స్మార్ట్ ఫోన్ ఉండకపోవడం ఆన్‌లైన్ లావాదేవీలపై వారికి అవగాహన లేకపోవడం కారణంగా నగదు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

ఒకవైపు విపణిలో నగదుకు ఇబ్బంది ఎదురవుతుంటే మరోవైపు సంపన్నుల వ్యక్తిగత లాకర్లలో నగదు నిల్వలు పేరుకుపోతున్నాయని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. ఇప్పటికే విపణిలో రూ.500 నోట్లు చలామణీ తగ్గింది. బ్యాంకులలో పలు సందర్భాలలో ఖాతాదారులకు నగదు చెల్లించడానికి ఇబ్బందులు పడుతున్నారు. ఆన్‌లైన్ పేమెంట్ ద్వారా లాభాలు ఉన్నట్లే నష్టాలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా వర్తక వాణిజ్యాలలో కొనుగోలుదారులు ఆన్‌లైన్ పేమెంట్ చేయడంతో చిల్లర సమస్య తగ్గడమే కాకుండా సమయం ఆదా అవుతున్నది. దీంతో ఆన్‌లైన్ లావాదేవీల వైపు వర్తకులు మొగ్గు చూపుతున్నారు. పన్ను చెల్లింపు ఇబ్బంది ఉన్న వర్తకులు నాలుగైదు ఆన్‌లైన్ ఖాతాలతో లావాదేవీలు జరుపుతున్నారు. టర్నోవర్‌ను బట్టి పన్ను చెల్లించాల్సిన పరిస్థితి ఉండడంతో కొంతమంది వర్తకులకు ఆన్‌లైన్ పేమెంట్‌లు ఇబ్బంది కలిగిస్తున్నాయి.

> ఒకప్పుడు జేబు నిండా నగదు ఉంటే మురిసిపోయే పరిస్థితి. ఇప్పుడు పాకెట్‌లో చిల్లిగవ్వ లేకపోయినా క్రెడిట్, డెబిట్ కార్డులు లేకపోయినా స్మార్ట్ ఫోన్ ఉంటే చాలు. ఎన్ని లక్షల లావాదేవీలైనా చేసేయొచ్చు.

నగదు దాస్తున్నారు..!

వ్యక్తిగతంగా ఒకరి వద్ద లేదా ఒక కుటుంబంలో రూ.2 లక్షలు మించి నగదు ఉండకూడదని నిబంధన ఉన్నప్పటికీ కోట్లాది రూపాయలు దాచేస్తున్నారు. స్థిరాస్తి విక్రయాలు మందంగా ఉండడం మార్కెట్ అస్థిరత్వం. ఆర్థిక మాంద్యం, భూముల ధర తగ్గుముఖం పట్టడం తదితర కారణాల నేపథ్యంలో సంపన్న వర్గాలు ఎక్కువగా నగదు నిల్వ చేయడం, లేదా బంగారంపై పెట్టుబడి పెడుతున్నారు. పరిమితికి మించి కొంతమంది పౌరులు వద్ద అధిక మొత్తం నగదు దాచడంతో నగదుకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. జిల్లాలో 80 శాతం పైబడి ఆన్‌లైన్ లావాదేవీలు జరుగుతున్నాయి. రానున్న రోజులలో విపణిలో నగదు చలామణి గణనీయంగా తగ్గిపోతుందని ఆర్థిక నిపుణుల అంచనా వేస్తున్నారు. విచిత్రం ఏమిటంటే అగ్రరాజ్యం అమెరికా లండన్, చైనా వంటి దేశాలను మించి మన దేశంలో ఆన్‌లైన్ ఆర్థిక లావాదేవీలు పెరగడం గమనార్హం.

సామాజిక సేవకుడు వెంకటరత్నంకు దాసరి సేవా రత్న అవార్డు

పాలకొల్లు అర్బన్, మే 2(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన సామాజిక సేవా కార్యకర్త యర్రంశెట్టి వెంకటరత్నంకు దాసరి సేవా రత్న అవార్డు లభించింది దాసరి నారాయణరావు జన్మదినం సందర్భంగా దాసరి ఫిల్మ్ అవార్డును వెంకటరత్నంకు సినీ నటులు మురళీ మోహన్, సుమన్, నిర్మాత తుమ్మలపల్లి రామ సత్యనారాయణ నుంచి అవార్డు అందుకున్నట్లు వెంకటరత్నం శుక్రవారం విలేకర్లకు తెలిపారు.

జర్నలిస్ట్ ఉదయ భాస్కర్‌కు అవార్డు

యలమంచిలి: మండలంలోని కొంతేరు గ్రామానికి చెందిన సీనియర్ జర్నలిస్టు గుమ్ములూరి ఉదయ భాస్కరరావు దాసరి సేవా రత్న అవార్డు లభించింది హైదరాబాద్‌లో గురువారం రాత్రి అవార్డు అందుకున్నట్లు భాస్కరరావు తెలిపారు. దిల్ రాజు, రేలంగి నరసింహరావు, తమ్మారెడ్డి భరద్వాజ, విజయేంద్ర ప్రసాద్, అనిల్ రావిపూడి, బి.గోపాల్, దివ్య వాణి విజయేంద్ర ప్రసాద్, తదితరులు పాల్గొన్నట్టు తెలిపారు.


దాసరి సేవా రత్న అవార్డు అందుకుంటున్న వెంకటరత్నం, ఉదయ భాస్కరరావు


కుక్కలవారితోటలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

ప్రకృతి వ్యవసాయంతో అనేక ప్రయోజనాలు

మొగల్తూరు, మే2(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతో అనేక ప్రయోజనాలున్నాయని జిల్లా ప్రకృతి వ్యవసాయ మేనేజర్ వై.నూకరాజు తెలిపారు. కుక్కలవారి తోటలో గ్రామస్థులు, రైతులకు అవగాహన కల్పిస్తూ శుక్రవారం నిర్వహించిన ర్యాలీ, సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా కోఆర్డినేటర్ ఎం.అరుణ్ కుమారి మాట్లాడుతూ రసాయనిక, పురుగుమందులు వాడకంతో ఖర్చులు పెరుగుతాయని, భూమి కలుషితమవుతుందని, పండిన పంటలు ఆరోగ్యానికి హానికలిగిస్తాయన్నారు. ప్రతీ ఇంటి పెరటిలో కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేసుకుని కూరగాయలు పెంచుకోవడం వల్ల ప్రయోజనాలు వివరించారు. ప్రకృతి వ్యవసాయానికి జీవామృతాలు తయారీపై రైతులకు అవగాహన కల్పించారు. డివిజన్ ఇన్‌చార్జ్ నరసింహరావు, మండల ఇన్‌చార్జ్ లక్ష్మీ కుమారి, సిబ్బంది, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

కార్మిక చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రత్నప్రసాద్


మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి రత్న ప్రసాద్

ఏలూరు క్రైం, మే 2 (ఆంధ్రజ్యోతి): దుకాణాల్లో పనిచేసే వారు స్వచ్ఛంద సంస్థలు, కార్మిక చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.రత్న ప్రసాద్ అన్నారు. దుకాణాల్లో పనిచేసే కార్మికులకు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులకు, అధికారులకు కార్మిక చట్టాలపై ఏలూరు జిల్లా కోర్టు ఆవరణలోని డీఎల్ఎస్ఎ భవనంలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. జడ్జి రత్న ప్రసాద్ మాట్లాడుతూ దుకాణాలల్లో, సంస్థల్లో కర్మాగారాల్లో బాలలతో పని చేయించరాదని స్పష్టం చేశారు. నేటి సమాజంలో అక్కడక్కడా బాల కార్మిక వ్యవస్థ కొనసాగుతుందని ఇది చాలా దురదృష్టమైన సంఘటన అని సమాజం సమష్టిగా నిరోధించాలని సూచించారు. దుకాణాలు, సంస్థల్లో కాని పనిచేసే కార్మికులకు పురుషులతో సమానంగా మహిళలకు కూడా వేతనాలు చెల్లించాలన్నారు. అదేవిధంగా పనిచేసే వారికి కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి కార్మికులు తమ వివరాలను ఈ-శ్రామ్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని, దీని ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందడానికి సులభతరం అవుతుందని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సహాయ లేబర్ అధికారి గోపాలకృష్ణ, రమణ, పలువురు పాల్గొన్నారు.


డీఆర్‌డీఏ ఉద్యోగి దేవళ్ల నాగరాజు మృతదేహం

ప్రధాని మోదీ సభకు వెళ్లి వస్తూ..

ఉద్యోగి మృతి

కైకరంలో రోడ్డు ప్రమాదం.. ఏలూరు ఆస్పత్రికి తరలించేలోపు మృతి

ఏలూరు క్రైం, మే 2 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి నరేంద్రమోదీ అమరావతిలో శంకుస్థాపన కార్యక్రమానికి ప్రజలను బస్సులో తీసుకువెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదంలో ఒక ఉద్యోగి మృతి చెందారు. మార్గమధ్యలో టీ తాగడానికి బస్సు ఆగడం రోడ్డు దాటుతున్న ఆ బస్సు ఇన్‌చార్జి, డీఆర్‌డీఏ ఉద్యోగిని వ్యాను ఢీ కొనడంతో మృత్యువాత పడ్డారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా డీఆర్‌డీఏలో మల్కిపురం మండల క్లస్టర్ ఇన్‌చార్జిగా దేవళ్ల తిమ్మల నాగరాజు (50) ఉద్యోగం చేస్తున్నారు. ఆయన ఆ మండలం నుంచి డ్వాక్రా మహిళలను తీసుకుని బస్సు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తూ అమరావతిలోని ప్రధాని సభకు శుక్రవారం వెళ్లారు. అక్కడ సభ ప్రాంగణం నిండిపోవడంతో లోపలికి వెళ్లడానికి అనుమతించలేదు. చివరకు సభ అయ్యే వరకూ బయటే ఉండి తిరిగి సాయంత్రం బయలుదేరారు. 5 గంటల సమయంలో ఉంగుటూరు మండలం కైకరం వద్ద రోడ్డు పక్కన టీ తాగడానికి బస్సును ఆపారు. అందరు టీ తాగుతుండగా నాగరాజు మూత్రవిసర్జన కోసం రోడ్డుదాటి వెళుతుండగా వ్యాన్ ఢీ కొంది. తీవ్ర గాయాలైన అతడిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. ఏలూరు తహసీల్దార్ ఎన్ శేషగిరిరావు హుటాహుటిన ఆసుపత్రికి వచ్చి పరిస్థితిని అడిగి తెలుసుకుని ఉన్నతాధికారులకు తెలియజేశారు. నాగరాజు మరణంపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి అవుట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

అన్న కొడుకును కత్తితో పొడిచిన చిన్నాన్న

పెంటపాడు, మే 2(ఆంధ్రజ్యోతి): ఫ్యాన్ వివాదంలో అన్న కొడుకుని చిన్నాన్న కత్తితో పొడిచిన సంఘటన పరిమెళ్ళ గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పరిమెళ్ళ గ్రామానికి చెందిన వెన్నపు రాంబాబు, తన అన్న వెన్నపు రామకృష్ణలు రెండు పోర్షన్ల డాబాలో నివాసం ఉంటున్నారు. బుధవారం రాంబాబు ఇంట్లో సీలింగ్ ఫ్యాన్ బిగించుకున్నాడు. దీంతో రాంబాబు అన్న కొడుకు నాగరాజు తనకు చెప్పకుండా ఫ్యాన్ ఎందుకు బిగించావని తన చిన్నాన్నతో గొడవ పడ్డారు. రాత్రి సమయంలో ఇంటికి వచ్చిన రాంబాబు నాతో ఎందుకు గొడవపడ్డావని నాగరాజుతో ఘర్షణకు దిగాడు. పక్కనే ఉన్న చాకుతో నాగరాజును పొడిచాడు. దీంతో బాధితుడిని చికిత్స నిమిత్తం తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఎస్ఐ స్వామి తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో ఫైనాన్స్ వ్యాపారి ఆత్మహత్య

ఏలూరు క్రైం, మే 2(ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక ఒక ఫైనాన్స్ వ్యాపారి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏలూరు శ్రీరామ్‌నగర్ 9వ రోడ్డుకు చెందిన నేలి దుర్గా వెంకట పద్మనాగేంద్రరావు (46) పవర్‌పేటలోని గురు రాఘవేంద్ర ఆటో ఫైనాన్స్ వ్యాపారం చేస్తున్నాడు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఇటీవల ఒక ఇల్లు కూడా కొన్నారు. ఆటో ఫైనాన్స్ వ్యాపారంలో నష్టాలు రావడంతో ఆర్థిక పరిస్థితులు తాళలేక జీవితంపై విరక్తి చెంది శుక్రవారం ఉదయం తన ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వెంటనే ఉరి నుంచి దించి ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకురాగా ఆసుపత్రి వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. ఈ సంఘటనపై ఏలూరు త్రీ టౌన్ సీఐ వి.కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ఎస్ఐ పి రాంబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

పురుగు మందు తాగి..

ఏకారణమో తెలియదు కాని ఒక వ్యక్తి పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ముసునూరు మండలం వజ్రంపాడు గ్రామానికి చెందిన మరీదు రాంబాబు (38)కి భార్య, పిల్లలు ఉన్నారు. శుక్రవారం పొలంలో పురుగుమందు తాగి పడిపోగా ఇరుగు పొరుగువారు చూసి ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకు వచ్చారు. చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం మృతి చెందాడు. ఈ సంఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీ నమోదు చేసి ఆసుపత్రి అవుట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షకు

ఫీజు తుది గడువు 5

ఏలూరు అర్బన్, మే 2 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు ఈ నెల 12నుంచి జరుగనున్నాయి. ఫీజును చెల్లింపు గడువును ప్రభుత్వం మరోదఫా పొడిగించిందని ఆర్ఐవో కె.యోహన్ తెలిపారు. ఇప్పటికీ ఫీజు చెల్లించని విద్యార్థులు ఈ నెల 3 నుంచి 5వ తేదీలోగా ఎటువంటి ఫెనాల్టీలేకుండానే తాము చదువుతున్న కళాశాలల్లో చెల్లించాలని, ఆ తదుపరి ఫీజు చెల్లించేందుకు ఇక అవకాశం ఉండబోదని స్పష్టం చేశారు.

ఈహెచ్ఎస్ కార్డులపై చికిత్సకు నిరాకరణ

ఏలూరు అర్బన్, మే 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ నుంచి ఆంధ్రప్రదేశ్‌లో విలీనమై దశాబ్దం గడిచినా కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో ఉపాధ్యాయులు ఆరోగ్య బీమా కార్డులపై జిల్లాలోని నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో నగదు రహిత వైద్యసేవలు అందడం లేదు. తక్షణమే చర్యలు చేపట్టాలని డీఈవో వెంకట లక్ష్మమ్మకు నోబుల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మురళి, రాము శుక్రవారం వినతిపత్రాన్ని అందజేశారు. కుక్కునూరు మండలానికి చెందిన ఉపాధ్యాయుడు రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయపడ్డారు. ఏలూరు శివార్లలోని కార్పొరేట్ ఆసుపత్రికి వెళ్లగా అక్కడి వైద్యులు ఈహెచ్ఎస్ కార్డుపై చికిత్స చేయడానికి నిరాకరించారని ఆరోపించారు. ఏపీలో విలీనమైన మండలాల టీచర్లకు ప్రభుత్వం జారీచేసిన హెల్త్‌కార్డులపై చికిత్స చేయకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. టెన్త్ ఫెయిలైన విద్యార్థులకు నిర్వహిస్తోన్న రెమిడియల్ క్లాసులకు హాజరవుతోన్న ఉపాధ్యాయులకు ఆర్జిత సెలవులను మంజూరు చేయాలని డీఈవోను కోరారు.


వృద్ధురాలిని కుటుంబ సభ్యులకు అప్పగించిన పోలీసులు

తప్పిపోయిన వృద్ధురాలిని అప్పగించిన పోలీసులు

ఏలూరు క్రైం, మే 2 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి తప్పిపోయిన చెవిటి, మూగ వృద్ధురాలిని పోలీసులు ఎట్టకేలకు కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఏలూరు రూరల్ మాదేపల్లిలో ఉన్న ఒక గుడి వద్ద వారం రోజుల క్రితం చెవిటి, మూగ వృద్ధురాలు కూర్చుని ఉంది. సమాచారం అందుకున్న ఏలూరు రూరల్ ఎస్ఐ సిహెచ్ దుర్గాప్రసాద్ వెంటనే స్పందించి ఆమెను సంరక్షణ హోమ్‌నకు తరలించారు. ఆమె ఫోటోను మీడియా, సోషల్ మీడియా ద్వారా విస్తృత ప్రచారం చేశారు. దీంతో ఆమె కుటుంబ సభ్యులు సోషల్ మీడియాలో చూసి ఏలూరు రూరల్ ఎస్ఐ దుర్గాప్రసాద్‌ను సంప్రదించారు. గుంటూరు జిల్లా దుగ్గిరాల మండలం గొడవ గ్రామానికి చెందిన కన్నా నాంచారయ్య భార్య పద్మావతిగా గుర్తించారు. దీంతో వారి కుటుంబ సభ్యులు శుక్రవారం రాత్రి రావడంతో ఆమెను అప్పగించారు. పోలీసులకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. వృద్ధురాలి ఫోటోను మీడియా, సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేసిన ప్రతి ఒక్కరికి ఎస్ఐ దుర్గా ప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు.

నేటి నుంచి సంగీత నృత్యోత్సవాలు

ఏలూరు రూరల్, మే 2 (ఆంధ్రజ్యోతి) : కళాదీపిక నృత్య అకాడమీ ఆధ్వర్యంలో ఈనెల 3, 4 తేదీలలో వైఎంహెచ్ఏ హాలు ప్రాంగణంలో సంగీత నృత్యోత్సవాలు నిర్వహిస్తున్నట్టు అకాడమీ నిర్వాహకులు పార్వతి రామచంద్రన్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 3న సద్గురు త్యాగరాజు స్వామి జయంతి సందర్భంగా కీర్తనలు ఆలాపన, అతిథుల ప్రసంగాలు, నాట్య రంగంలో విశేష కృషి చేసిన వారికి సత్కారాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. 4న సంగీత కచేరి, కూచిపూడి నృత్య ప్రదర్శనలు, సంగతంలో విశిష్ట సేవలందించిన వారికి సత్కరిస్తామన్నారు.


కలపర్రు టోల్‌గేటు వద్ద అమరావతి సభకు వెళుతున్న బస్సులు

ఎన్టీఆర్ పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు అర్బన్, మే2(ఆంధ్రజ్యోతి): టీడీపీ వ్యవస్థాపకుడు డాక్టర్ నందమూరి తారకరామారావు జయంతి మే 28న పురస్కరించుకుని తెలుగురాష్ట్రాల్లో విద్య, వైద్యం, కళ, సమాజసేవ, క్రీడారంగాల్లో విశిష్ట సేవలందించిన వారిని గుర్తించి 'ఎన్టీఆర్ సేవారత్న, కళారత్న-2025' అందిస్తామని హైదరాబాద్‌కు చెందిన ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ స్థాపక అధ్యక్షుడు డాక్టర్ ఈ.ఎస్.ఎస్.నారాయణ మాస్టారు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జాతీయస్థాయి పురస్కారాలతో సత్కరించేందుకు అర్హులైనవారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు తెలిపారు. విద్యావంతులు, ఉపాధ్యాయులు, సమాజసేవకులు, వైద్యులు, కవులు, రచయితలు, క్రీడాకారులు తమ ప్రతిభను తెలిపే సర్టిఫికెట్లు, పత్రికల క్లిప్పింగ్‌ల జిరాక్స్ కాపీలు, నాలుగు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో దరఖాస్తులను ఈనెల 15లోగా ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ, డోర్‌నెంబరు 1-20-164, గోకుల్‌నగర్, వెంకటాపురం, తిరుమలగిరి పోస్టు, సికింద్రాబాద్-15 చిరునామాకు పంపాలని సూచించారు. వివరాలకు 96523 47207 నంబరులో సంప్రదించాలని కోరారు.


డీఈవో కార్యాలయంలో వినతిపత్రాలను ప్రదర్శిస్తున్న సంఘ నాయకులు

'ఉర్దూ బోధించే టీచర్లనే నియమించాలి'

ఏలూరు అర్బన్, మే 2(ఆంధ్రజ్యోతి): ఉర్దూ మాధ్యమ పాఠశాలల్లో ఉర్దూ బోధించే టీచర్లనే నియమించాలని, రాష్ట్రంలో రెండో అధికారభాషగా గుర్తించిన ఉర్దూభాషను కాపాడాలని ఆర్‌యూటీఏ ఏలూరు జిల్లాశాఖ అధ్యక్షుడు సయ్యద్ జిలానీ కోరారు. శుక్రవారం రాష్ట్రీయ ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ (ఆర్‌యూటీఏ) ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల బృందం డీఈవో వెంకటలక్ష్మమ్మను కలిసి వినతిపత్రాన్ని అందజేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు పాఠశాలల్లో తెలుగు, ఉర్దూ మాధ్యమాలకు చెందిన విద్యార్థులున్నందున అటువంటి పాఠశాలల్లో రెండు మీడియంలలోనూ టీచర్లను నియమించాలని కోరారు. సంఘ నాయకులు ఖలీల్, సల్మాన్, షఫీ, సిరాజ్, అబ్దుల్‌రజాక్, బేగం, అనీష్ ఫాతిమా, నూర్జహాన్, కాజాపర్వీన్, హలీదాబేగం, బాజీదున్నీసా, తదితరులున్నారు.

కులగణనకు రాజకీయ పార్టీలు మద్దతు ఇవ్వాలి


కె.విజయ్

ఏలూరు రూరల్, మే 2(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ నేతృత్వంలో కేంద్ర మంత్రివర్గం తీసుకున్న కులగణన నిర్ణయాన్ని ఓబీసీ మోర్చా స్వాగతిస్తుందని బీజేపీ ఓబీసీ మోర్చా ఏలూరు జిల్లా అధ్యక్షుడు కాట్రు విజయ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దేశంలో చివరి సమగ్ర కులగణనను బ్రిటీష్ ప్రభుత్వం 1931లో నిర్వహించిందని, అప్పటినుంచి షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగల డేటా తప్ప, జాతీయస్థాయిలో అధికారిక కులగణన జరగలేదన్నారు. 94 ఏళ్ల తరువాత ఈ ప్రక్రియ పునరుద్ధరించాలనే మోదీ ప్రభుత్వ నిర్ణయం పారదర్శకత నిబద్ధతకు నిదర్శనమన్నారు. దేశ సామాజిక ఆర్థిక పునాదులను బలోపేతం చేసే ఈ జాతీయ జనగణనకు అన్ని రాజకీయ పార్టీలు మద్దతివ్వాలని కోరారు.


సీపీఐ మండల కార్యదర్శిగా బాడిత రాము

వేలేరుపాడు, మే 2(ఆంధ్రజ్యోతి): వేలేరుపాడు మండల సీపీఐ మండల కార్యదర్శిగా బాడిత రాము రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సహాయ కార్యదర్శిగా పిట్టా ప్రసాద్‌ను ఎన్నుకున్నారు. శుక్రవారం గ్రామంలో జరిగిన సీపీఐ 17వ మండల మహాసభల్లో మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మొత్తం 55మందితో మండల కమిటీ ఏర్పడగా 17మందిని కార్యవర్గంలో చేర్చుకున్నారు. బాడిత రాము మాట్లాడుతూ రెండోసారి కార్యదర్శిగా ఎన్నుకున్నందుకు పార్టీకి కృతజ్ఞతలు తెలిపారు. సహాయ కార్యదర్శిగా ఎన్నికైన పిట్టా ప్రసాద్, గిరిజన ప్రాంతాల్లో ఉన్న ప్రత్యేక చట్టాలను అమలయ్యేలా పోడుభూములకు పట్టాలు ఇప్పించేలా పోరాటాలు చేస్తామని తెలిపారు. మహాసభలో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య, ఏపీజీఎస్ రాష్ట్ర అధ్యక్షులు కారం దారయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు సాయిబాబు, మహిళా సమాఖ్య జిల్లాకార్యదర్శి మన్నవ యామిని, తదితరులు పాల్గొన్నారు.


వెంకటేశ్వర్లు దంపతులను సత్కరిస్తున్న సంఘ ప్రతినిధులు

ఘనంగా సాహిత్య కళా ఉత్సవం

ఏలూరు రూరల్, మే 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు, స్టాంప్స్, రిజిస్ట్రేషన్‌శాఖ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ డాక్టర్ లంకా వెంకటేశ్వర్లు ఉద్యోగ విరమణ సందర్భంగా జిల్లా రచయితల సంఘం సాహిత్య కళా ఉత్సవం వైఎంహెచ్ఏ హాల్‌లో ఘనంగా జరిగింది. వెంకటేశ్వర్లు ఉద్యోగ విరమణ సందర్భంగా ప్రముఖ సాహితీవేత్తల వ్యాసాలతో ప్రచురించిన 'మట్టి పువ్వైన వేళ' అభినందన సంచికను సినీ కవి రసరాజు చేతుల మీదుగా ఆవిష్కరించారు. ప్రముఖ కవి కొప్పర్తి వెంకట రమణ మూర్తి, ప్రముఖ సాహిత్య విమర్శకులు గుంటూరు లక్ష్మీనరసయ్య, సినీ విమర్శకులు ఎస్వీ రామారావు మాట్లాడారు. గౌరవ అతిథులు కేవీ సత్యనారాయణ, ఆర్‌వీఎస్ రాజు, లేళ్ళ వెంకటేశ్వరరావు, సుంకర గోపాల్, కానూరి బద్రీనాథ్, కొల్లేటి రవిబాబు, ఆత్రేయ బాబు ప్రసంగించారు. లంకా వెంకటేశ్వర్లు, వరలక్ష్మీ దంపతులను సాహిత్య, కళా రంగాల సంస్థలు, స్నేహితులు, బంధువులు ఘనంగా సత్కరించారు. ఆలపాటి నాగేశ్వరరావు, వేణుగోపాల్, లూనాని, పెదపాటి రామకృష్ణ తదితరులు పర్యవేక్షించారు.



వెంకటాపురంలో ఆందోళన చేస్తున్న రైతులు

లక్ష్యం పేరుతో ధాన్యం కొనుగోళ్ల నిలిపివేత తగదు

ఏలూరు రూరల్, మే 2(ఆంధ్రజ్యోతి): లక్ష్యం పేరుతో ధాన్యం కొనుగోళ్ల నిలిపివేత తగదని ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో వెంకటాపురం రైతు సేవా కేంద్రం వద్ద రైతులు, కౌలు రైతులు శుక్రవారం సాయంత్రం ధర్నా నిర్వహించారు. ట్రాక్టర్లు, లారీల్లోకి లోడ్ చేసిన ధాన్యాన్ని మిల్లులకు పంపాలంటూ నినాదాలు చేశారు. సంఘ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్ల లక్ష్యం పెంచి రైతుల వద్ద వున్న ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కోరారు. కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేసి అన్నదాతలు ఆదుకోవాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. బాధిత రైతులు బైరెడ్డి లక్ష్మణరావు, తిరుమలశెట్టి లీలా మాధవ రాము, అకిరి నాగరాజు, తోట సత్యనారాయణ, తిరుమలశెట్టి జగదీశ్వరరావు, నిమ్మల వాసు, చిన్ని కృష్ణ, సూరంగుల వెంకటేశ్వరరావు, బి.రాజు, తదితరులు పాల్గొన్నారు.

● ఉంగుటూరు : కైకరం, కాగుపాడు గ్రామాల్లోనూ ఏపీ రైతు సంఘంతోపాటు టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు కడియాల రవిశంకర్ నాయకత్వంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. ధాన్యం కొనుగోలు చేయాలని నినాదాలు చేశారు. రైతు సంఘం నాయకులు గుత్తికొండ వెంకటకృష్ణారావు, జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, జలసూత్రం కన్నారావు, నక్కా వెంకట్రావు, కె.రామారావు, ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


హనుమాన్ జంక్షన్ సమీపంలో బస్సును ప్రారంభిస్తున్న దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్


భీమడోలులో బస్సుకు జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ధర్మరాజు, గన్ని వీరాంజనేయులు


కామవరపుకోటలో కూటమి నాయకుల ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్


కలపర్రు టోల్‌గేటు సమీపంలో టీడీపీ నాయకులు ఘంటా మురళి, పార్టీ శ్రేణులు

కూటమి జోష్..

అమరావతిలో మోదీ సభకు తరలి వెళ్లిన కూటమి నాయకులు

పెదపాడు/పెదవేగి/దెందులూరు, మే 2(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర రాజధాని అమరావతిలో ప్రధాని మోదీ బహిరంగ సభకు పెదపాడు మండలం నుంచి కూటమి శ్రేణులు బస్సులు, కారులు, మోటారుసైకిళ్లపై తరలివెళ్లారు. పలు ప్రాంతాల నుంచి ఏలూరు మీదుగా రాజధానికి తరలివెళ్లే వారిలో కొంతమందికి పెదపాడు మండలం వట్లూరు గురుకుల పాఠశాల వద్ద బస, వసతి, ఆహార ఏర్పాట్లను అధికారులు ఏర్పాటు చేశారు. కూటమి శ్రేణులతో కూడిన బస్సులకు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ హనుమాన్ జంక్షన్ సమీపంలో జెండాను ఊపారు. పెదవేగి మండలం నుంచి ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఆధ్వర్యంలో బస్సులు, కార్లలో టీడీపీ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. వారికి తాగునీరు, ఆహారం ఎమ్మెల్యే అందించారు. టీడీపీ నాయకులు బొప్పన సుధాకర్, తాతా సత్యనారాయణ, మేకా కనకరాజు, మాగంటి నారాయణ ప్రసాద్, మంచినేని శ్రీనివాసరావు, మాదు రవికుమార్, కొనకళ్ల శివమణి, పంది సూర్యచంద్రరావు తరలివెళ్లారు. దెందులూరు మండలంలో అన్ని గ్రామాల్లో టీడీపీ మండల అధ్యక్షుడు మాగంటి నారాయణప్రసాద్, నియోజకవర్గ అధ్యక్షుడు మోతుకూరి నానిబాబు ఆధ్వర్యంలో తరలివెళ్లారు. జోగన్నపాలెం నుంచి సహకార సంఘ బ్యాంకు మాజీ అధ్యక్షుడు డాక్టర్ పసుమర్తి మధుబాబు ఆధ్వర్యంలో పెరుగుగూడెం నుంచి మాజీ సర్పంచ్ యలమర్తి శ్రీనివాస్, పావులూరి దశరధరా మయ్య అమరావతి సభకు భారీ తరలి వెళ్లారు.

● జంగారెడ్డిగూడెం/లింగపాలెం/కామవరపుకోట : జంగారెడ్డిగూడెం పట్టణం, మండలం నుంచి భారీస్థాయిలో కూటమి శ్రేణులు తరలివెళ్లారు. పట్టణంలో మూడు బస్సులను టీడీపీ పట్టణ అధ్యక్షుడు రావూరి కృష్ణ, టీడీపీ సీనియర్ నాయకుడు పరిమి సత్తిపండు జెండా ఊపి ప్రారంభించారు. ముప్పై కార్లలో కూటమి నాయకులు తరలివెళ్లారు. పలు గ్రామాల నుంచి ఐదు బస్సులు, 20 కార్లలో టీడీపీ మండలాధ్యక్షుడు సాయిల సత్యనారాయణ ఆధ్వర్యంలో వెళ్లారు. రాష్ట్ర కార్పొరేషన్ల డైరెక్టర్లు నంబూరి రామచంద్రరాజు, చిట్టిబోయిన రామలింగేశ్వరరావు, టీడీపీ నాయకులు పెనుమర్తి రామకుమార్, తూటిగుంట రాము, కొండ్రెడ్డి కిషోర్, మహంకాళి రామ్మోహనరావు, కంపా రాజేంద్ర, చేను ప్రసాద్, అల్లూరి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. లింగపాలెం మండలంలో టీడీపీ మండల అధ్యక్షుడు గరిమళ్ల చలపతిరావు ఆధ్వర్యంలో బస్సులు, కార్లలో వేలాది మంది ప్రజలు తరలివెళ్లారు. ఎంపీడీవో కె.వాణి, మోరంపూడి మల్లికార్జునరావు, ముసునూరి రాము, జి.బుజ్జయ్య, పి.శ్రీనివాసరావు, పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు. కామవరపుకోట మండలం నుంచి కూటమి నేతలు తరలి వెళ్లారు. పలు వాహనాలకు పార్టీల జెండాలు, బ్యానర్లు ఏర్పాటు చేసుకున్నారు. కామవరపుకోటలో చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్, తడికలపూడిలో మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణ, టీడీపీ మండల అధ్యక్షుడు కిలారు సత్యనారాయణ జెండాలు ఊపి ప్రారంభించారు.

● భీమడోలు/ఉంగుటూరు/నిడమర్రు : ఉంగుటూరు నియోజకవర్గం నుంచి బయలుదేరిన బస్సులు, కార్లకు జెండా ఊపి ఎమ్మెల్యే ధర్మరాజు,టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు కార్యకర్తలను ఉత్తేజపరిచారు. అమరావతి పర్యటనలో భాగంగా ప్రధాని మోదీని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు మర్యాదపూర్వకంగా కలిశారు. ఉంగుటూరు మండలం నుంచి ఎమ్మెల్యే. పత్సమట్ల ధర్మరాజు, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి శరణాల మాలతీరాణి నాయకత్వంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఆయా పార్టీల శ్రేణులు తరలివెళ్లారు. కాగుపాడులో కడియాల రవి శంకర్ నాయకత్వంలో తరలివెళ్లారు. నిడమర్రు మండలం నుంచి ఎనిమిది బస్సులు బయలుదేరి వెళ్లాయని, వారికి కావాల్సిన ఆహారం, మంచినీరు, అరటిపండ్లు ఏర్పాట్లు చేశామని ఎంపీడీవో విజయకుమారి తెలిపారు. ముత్యాలస్వామి, నిమ్మల దొరబాబు, పొట్నూరి సింహాచలం, అల్లుమోలు అరుణ్‌కుమార్, వాకమూడి ఇంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

●పోలవరం/జీలుగుమిల్లి/టి.నరసాపురం/కొయ్యలగూడెం: పోలవరం మండలం నుంచి కూటమి నేతలు, ప్రజలు ప్రత్యేక బస్సులలో ఐటీడీఏ పీవో రాములునాయక్ ఆధ్వర్యంలో అమరావతి తరలి వెళ్లారు. అమరావతి యాత్ర బస్సులను ఏపీ ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు జెండా ఊపి ప్రారంభించారు. ఎంపీడీవో చెరుకూరి శ్రీనివాస్‌బాబు, కూటమి నేతలు బొడ్డు కృష్ణ, నునకాని రాంబాబు, మాగంటి రాము, కొత్తపల్లి సత్యనారాయణ, పాదం ప్రసాద్, ఆకల రాజా, గుబ్బా రాంబాబు, మంగిన కొండ, పొట్నూరి నారాయణరావు, గునపర్తి చిన్ని పాల్గొన్నారు. జీలుగుమిల్లి మండలం నుంచి నాయకులు బస్సుల్లో తరలివెళ్లారు. జీలుగుమిల్లి, దర్భగూడెం, రౌతుగూడెం, పి.రాజవరం నుంచి కూటమి నాయకులు బస్సుల్లో వెళ్లారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చాత్రాతి ప్రసాద్, పార్టీ మండల అధ్యక్షుడు గుడ్ల రాంబాబు, సీనియర్ నాయ కులు కెవెల్.ప్రసాద్ ఉపాధ్యక్షుడు భీమిరెడ్డి ప్రాదరెడ్డి, గెడ్డం రామకృష్ణ ఉన్నారు. టి.నరసాపురం మండలం నుంచి బస్సులో కూటమి నేతలు, కార్యకర్తలు, భారీ సంఖ్యలో తరలివెళ్లారు. కొయ్యలగూడెం మండలం నుంచి భారీగా కూటమి నాయకులు తరలివెళ్లారు. టీడీపీ మండల అధ్యక్షుడు పారేపల్లి నరేశ్, జనసేన మండల అధ్యక్షుడు తోట రవి, బీజేపీ మండల అధ్యక్షుడు గొలిశెట్టి వాసు, బొబ్బర చినరాజు, చిరువూరి శ్రీను, రవీంద్ర, వెంట్రమణ, రమణ, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

● కుక్కునూరు : కుక్కునూరు మండలం నుంచి కూటమి నాయకులు తరలివెళ్లారు. టీడీపీ మండల అధ్యక్షుడు ములిశెట్టి నాగేశ్వరరావు, జనసేన మండల అధ్యక్షుడు ఎం.యుగంధర్, నాయకులు పాల్గొన్నారు.


పోలవరంలో అమరావతికి బయలుదేరే బస్సుల వద్ద కూటమి నేతలు


జంగారెడ్డిగూడెంలో బస్సును జెండా ఊపి ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు


మోదీ సభలో పాల్గొన్న ఎమ్మెల్యే చంటి, ఎంపీ పుట్టా

మోదీ సభలో ఎమ్మెల్యే చంటి బృందం

ఏలూరుటూటౌన్:రాజధాని అమరావతి నిర్మాణానికి పునఃప్రారంభించనున్న ప్రధాని మోదీ సభకు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య(చంటి) తన అనుచరగణంతో తరలివెళ్లారు. ఏలూరు నుంచి బస్సులో బయల్దేరిన ప్రజలను ముందుగా పంపించారు. నియోజకవర్గం నుంచి వేలాదిగా కూటమి నాయకులు వెళ్లారు.

వేసవి జాగ్రత్తలపై అవగాహన

ఏలూరు అర్బన్, మే 2 (ఆంధ్రజ్యోతి):వడదెబ్బ తగులకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ మలేరియా విభాగం ఆధ్వర్యంలో స్థానిక ఆముదాల అప్పలస్వామి కాలనీ, వడ్డెరగూడెం ప్రాంతాల్లో ఇంటింటికీ సిబ్బంది తిరిగి అవగాహన కల్పించారు. అసిస్టెంట్ మలేరియా అధికారి గోవిందరావు మాట్లాడుతూ వేసవిలో కాటన్‌దుస్తులు ధరించాలని, ఎక్కువగా ద్రవపదార్థాలు కొబ్బరినీళ్లు, గ్లూకోజ్‌వాటర్, మజ్జిగ, ఓఆర్ఎస్ ద్రావణం వంటివి తీసుకోవాలని సూచించారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో పూర్వ ప్రాథమిక విద్యనభ్యసిస్తోన్న చిన్నారులకు చేతులను పరిశుభ్రంగా ఎలా ఉంచుకోవాలో డెమోద్వారా చూపించారు. వైద్యసిబ్బంది పాల్గొన్నారు.


తిమ్మాపురంలో రోడ్డు నిర్మాణపనులు ప్రారంభిస్తున్న టీడీపీ నేతలు


ఉపాధి హామీ నిధులతో
సీసీ రోడ్డు పనుల ప్రారంభం

ద్వారకాతిరుమల, మే 2(ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ నిధులతో చేపట్టనున్న సీసీ రహదారి నిర్మాణం తిమ్మాపురంలో శుక్రవారం టీడీపీ నేతలు భూమిపూజ చేశారు. కొబ్బరికాయలు కొట్టి రహదారి నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ రహదారి నిర్మాణానికి గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు కృషితో నిధులు కేటాయించారు. గ్రామంలోని రైతులతో పాటు గ్రామ పరిసర ప్రాంతాల్లోని ఎందరో రైతులకు ఈ రహదారి ఎంతగానో ఉపకరించనుంది. కార్యక్రమంలో టీడీపీ నేత పోలిన శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ ఏపూరి దాలయ్య, నేతలు ఘంటా శ్రీనివాసరావు, కానుమిల్లి విష్ణు, జి.చంద్రశేఖరరావు, సర్పంచ్ ఎర్రగొల్ల రజని, ఆచంట సత్యనారాయణ, వడ్ల పట్ల ధర్మయ్య, ఎం.ప్రభాకర్, కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేత్రపర్వంగా శివకల్యాణం

ద్వారకాతిరుమల, మే 2(ఆంధ్రజ్యోతి): క్షేత్ర పాలకునిగా విరాజిల్లుతోన్న శివదేవుని ఆలయంలో స్వామివారి కల్యాణం శుక్రవారం నేత్రపర్వంగా జరిగింది. లోకకల్యాణార్థం ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని జరిగిన ఈ కల్యాణతంతు భక్తులను అలరించింది. శ్రీవారి ప్రధాన ఆలయానికి దత్తత దేవాలయమైన ఆలయ ముఖ మండపంలో ఏర్పాటు చేసిన వేదికపై గంగా, పార్వతీసమేత శివయ్య కల్యాణమూర్తులను ఉంచి అర్చకులు ప్రత్యేక పుష్పాలంకరణలు చేశారు. అనంతరం కల్యాణతంతును ప్రారంభించారు. శుభముహూర్త సమయంలో నూతన వధూవరుల శిరస్సులపై జీలకర్ర బెల్లం ధరింపచేసి మాంగల్యధారణ, తలంబ్రాలు మేళతాళాలు, డోలు, సన్నాయివాయిద్యాల నడుమ ఘనంగా నిర్వహించారు.

విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి



పోలవరం, మే 2(ఆంధ్రజ్యోతి) : విద్యుదా ఘాతంతో పాడి గేదె మృతి చెందిన ఘటన ప్రగడపల్లి గ్రామంలో శుక్రవారం జరిగింది. రైతు చాపర్ల వెంకటాచలం వివరాలివి.. గురువారం రాత్రి వీచిన ఈదురు గాలులు వర్షాలకు పంటపొలాల్లో ఉన్న తాటిచెట్టు నేలకూలి విద్యుత్ లైన్లు తెగిపడ్డాయని మేత కోసం వెళ్లిన గేదెకు తీగలు తగిలి మృతి చెం దిందని తెలిపారు. ఈ విషయాన్ని విద్యుత్‌శాఖ అధికారులకు, స్థానిక పశువైద్యులకు సమాచారం అందించామని తెలిపారు. ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందించేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరారు.


ఏలూరు విమలాదేవి పాఠశాలలో ఆడి పాడుతున్న బాలికలు

ఉత్సాహంగా 'కిశోరి వికాసం' శిక్షణ తరగతులు

ఏలూరురూరల్/దెందులూరు/ఉంగుటూరు/జంగారెడ్డిగూడెం/పెదవేగి/ఏలూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ద్వారా పలు శాఖల సమన్వయంతో జిల్లాలో ఉత్సాహంగా కిశోరి వికాసం శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని ఐసీడీఎస్ పీడీ శారద తెలిపారు. శుక్రవారం ఏలూరు 12 పంపుల సెంటర్‌లోని విమలాదేవి స్కూల్లో వేసవి ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల పదోతేదీ వరకు ప్రతీ సచివాలయ పరిధిలో ఉన్న యుక్తవయస్సు బాలికలను ఒకచోటకు చేర్చి వారికి ఆరు రకాల అంశాలపై జీఎంఎస్‌కే, అంగన్‌వాడీ వర్కర్, ఏఎన్‌ఎం, స్కూల్ టీచర్, ఆశా వర్కర్, వీవోలతో గ్రూపుగా ఏర్పాటు చేసి పలు రకాల పద్ధతిలో అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తారన్నారు. దీనిలో భాగంగా పలు రకాల ఆటలతోనూ వినోదభరితంగా పాటలు, డ్యాన్సులు కోలాటాలతోను ఆహ్లాదకరంగా నిర్వహిస్తామన్నారు. జిల్లా బాలల సంరక్షణ అధికారి డాక్టర్ సీహెచ్ సూర్యచక్రవేణి, ఏలూరు ఐసీడీఎస్ టీచర్లు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు మౌనిక, మంగ, డీసీపీయూ సిబ్బంది రాజు, రాజేష్, తదితరులు పాల్గొన్నారు. దెందులూరు మండలం దెందులూరు అంగన్వాడీ సెంటర్‌లో సెక్టార్ సూపర్‌వైజర్‌లు చిట్టమ్మ, శ్రీదేవి, పద్మభూషణం ఆధ్వర్యంలో, ఉంగుటూరు మండలం ఉప్పాకపాడు గ్రామంలో బాల్య వివాహాల నిరోధక కమిటీ సభ్యులు అల్లు శ్రీను, వెల్ఫేర్ అసిస్టెంట్ ఝాన్సీ ఆధ్వర్యంలో, జంగారెడ్డిగూడెం రమూడో వార్డులోని 58 వ కోడ్ అంగన్‌వాడీ కేంద్రం వద్ద ఐసీడీఎస్ సీడీపీవో పి.బ్యూలా ఆధ్వర్యంలో, పెదవేగి మండలం పెదవేగిలో ఐసీడీఎస్ పెదవేగి సెక్టారు సూపర్‌వైజర్ సీహెచ్.పార్వతి ఆధ్వర్యంలో కిశోర బాలికలకు శిక్షణ తరగతులు నిర్వహించారు.



టి.నరసాపురంలో అష్టోత్తర పూజలు.. ద్వారకాతిరుమల శివయ్య ఆలయంలో ఆదిశంకరాచార్యులుకు పూజలు

ఘనంగా ఆదిశంకరుని జయంతి వేడుకలు

ద్వారకాతిరుమల/టి.నరసాపురం/ఉంగుటూరు మే 2(ఆంధ్రజ్యోతి): జగద్గురు ఆదిశంకరాచార్యుని జయంతి వేడుకలు శ్రీవారిక్షేత్రంలో శుక్రవారం వైభవంగా నిర్వహించారు. స్థానిక శివాలయంలో ఆదిశంకరుని విగ్రహాన్ని ఒక ప్రత్యేక పల్లకి వాహనంలో ఉంచి అలంకరించి, పండితుల వేదమంత్రోచ్ఛరణల నడుమ విశేష పూజలు జరిపారు. ఆ తరువాత పల్లకి వాహనంలో ఉంచి క్షేత్ర పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం శివాలయంలో ఆయన విగ్రహాన్ని గణపతి వద్ద ఉంచి పూజించారు. టి.నరసాపురం మండలం టి.నరసాపురంలో ఉన్న అన్నపూర్ణ, విశాలక్షి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో ఆదిశంకరాచార్యులు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అష్టోత్తర పూజలు, భజన కార్యక్రమాలు నిర్వహించారు. ఉంగుటూరు మండలం కైకరం శివాలయంలో గీతామృత వాహిని సత్సంగ్, సీతారామ గీతార్చన భజన మండలి ఆధ్వర్యంలో చిత్రపటం వద్ద పూజలు చేశారు.

అంబికా ఆలయంలో సామూహిక కుంకుమార్చనలు

ఏలూరుకార్పోరేషన్, మే 2, (ఆంధ్రజ్యోతి). వైశాఖ శుద్ధ పంచమి ఆరుద్ర నక్షత్రం కావడంతో సత్రంపాడులోని అంబికాదేవి అమ్మవారి ఆలయంలో శుక్రవారం అర్చకులు వారణాసి రాఘవేంద్రశర్మ భక్తులతో రాహుకాల శ్రీచక్ర కుంకుమార్చనలు జరిపించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని వ్రతాలలో పాల్గొన్నారు. ఆలయ సహాయ అర్చకులు కపిల శివశంకరప్రసాద్ భక్తుల గోత్రనామాలతో అర్చనలు జరిపారు. అంబికాదేవి అమ్మవారి నామస్మరణతో ఆలయ ప్రాంతం మారుమ్రోగింది. ఆలయ మేనేజర్ ఓలేటి మల్లికార్జునరావు భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు.

రేపటి నుంచి పుంతలో
ముసలమ్మ జాతర

దెందులూరు, మే 2(ఆంధ్రజ్యోతి): కొవ్వలి గ్రామ శివారులో ఉన్న పుంతలో ముసలమ్మ జాతర ఈనెల నాలుగు, ఐదో తేదీల్లో నిర్వహిస్తామని ఆలయ ధర్మకర్త ఆలపాటి రామకృష్ణ తెలిపారు. ఈ జాతరను దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, ఎంపీ పుట్టా మహేష్ కుమార్‌యాదవ్ చేతుల మీదుగా వేదవేద పండితులు ఆధ్వర్యంలో ప్రారంభి స్తారన్నారు. ఐదో తేదీ మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు.

ఉత్తమ టీచర్ కృష్ణకు సత్కారం

ఏలూరు అర్బన్, మే 2 (ఆంధ్రజ్యోతి) : ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాన్ని ప్రభుత్వం నుంచి ఇటీవల అందుకున్న జి.కృష్ణను శుక్రవారం స్థానిక గిరిజన లంబాడి సుగాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సత్కరించారు. సంఘ నాయకులు ధారావతు కీమ్యానాయక్, రాజబాబు నాయక్, చింతలపూడి ఎంపీపీ బాణావతు రాంబాబు నాయక్ పాల్గొన్నారు.

కోట ఎంపీడీవో
సుజాత బాధ్యతల స్వీకరణ

కామవరపుకోట, మే 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాలతో దెందులూరు ఏవోగా పని చేస్తున్న వై.సుజాత శుక్రవారం కామవరపుకోట ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జి ఎంపీడీవోగా పనిచేస్తున్న పి.సరళకుమారి నుంచి చార్జి తీసుకున్నారు. ఆమెకు ఈవోపీఆర్‌డీ సరళకుమారి, కార్యాలయ ఏవో ఎస్.ఎన్‌బీ సత్యవేణి, సీనియర్ అసిస్టెంట్ కె.వి.వి.రాంబాబు, జూనియర్ అసిస్టెంట్ బి.రామకృష్ణ, టైపిస్టు సీహెచ్ కల్యాణి, ఎంఆర్‌సీ కె.విజయవర్ధిని శుభాకాంక్షలు తెలిపారు.

పోరాటాలతోనే
సమస్యల పరిష్కారం

బుట్టాయగూడెం, మే 2(ఆంధ్రజ్యోతి) : సమస్యల పరిష్కారానికి పోరాటాలే శరణ్యమని కార్మికవర్గం సిద్ధం కావాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దర్శుల సురేష్ తెలిపారు. మే డే వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఇఫ్టూ అనుబంధ సంఘం భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో దొరమామిడిలో మేడే ఉత్సవాలు జరగ్గా పాకిరం రాజేష్ కార్మిక జెండాను ఎగురవేశారు. ఆయన మాట్లాడుతూ బీజేపీ అన్నివర్గాల ప్రజల హక్కులను హరిస్తున్నట్టు తెలిపారు. మతాల పేరుతో రెచ్చగొడుతున్నారని వీటికి వ్యతిరేకంగా పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. నాయకులు వి.వెంకటేశ్వరావు, కె.నాగరాజు, కె.శ్రీను, బానురెడ్డి, సురేష్, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ నిలుపుదల

కొయ్యలగూడెం, మే 2 (ఆంధ్రజ్యోతి): బోడిగూడెం సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం కరెంటు నిలుపుదల చేస్తామని ట్రాన్స్‌కో ఈఈ అహ్మద్‌ఖాన్ తెలిపారు. ఉదయం ఏడు నుంచి 12 గంటల వరకు కరెంట్ సరఫరా ఉండదని, రైతులు, వినియోగదారులు గమనించాలన్నారు.

సచివాలయానికి వాటర్ కూలర్ వితరణ

ముదినేపల్లి, మే 2 (ఆంధ్రజ్యోతి): వడాలి గ్రామ సచివాలయంలో తాగునీటి సౌకర్యం కోసం వాటర్ కూలర్‌ను ఏర్పాటు చేశారు. ఆ గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు స్వర్గీయ గురువు సుబ్రహ్మణ్యం జ్ఞాపకార్థం ఆయన కుమారులు అప్పాజీ, రాంబాబు, నాగమల్లేశ్వరరావు ఏర్పాటు చేసిన ఈ వాటర్ కూలర్‌ను శుక్రవారం తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు ప్రారంభించారు.

పదోన్నతిపై ఎంపీడీవో రాణి బదిలీ

ముసునూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): ముసునూరు ఎంపీడీవో జి.రాణి పదోన్నతిపై డివిజినల్ డెవలప్‌మెంట్ అధికారిణిగా నరసాపురం వెళ్లారు. ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా ఈవోపీఆర్డీ బి.ఏ సత్యనారాయణకు పూర్తి అదనపు బాధ్యతలను అప్పగిస్తు జిల్లా ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. శుక్రవారం ఆయన బాధ్యతలను స్వీకరించారు.

5 నుంచి చిన్నారులకు ఆధార్ శిబిరాలు

నూజివీడు, మే 2 (ఆంధ్రజ్యోతి):ఆరేళ్ల లోపు వయస్సు ఉన్న పిల్లలకు ఆధార్‌కార్డు నమోదుకు ఈనెల 5వ తేదీ నుంచి ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్లు సచివాలయ అధికారులు తెలిపారు. ఈనెల 5నుంచి 8వరకు, 12వ తేదీ నుంచి 15 వరకు ఈ శిబిరాలు నడుస్తాయి. చిన్నారుల బర్త్‌సర్టిఫికెట్లు తీసుకువెళ్ళి గ్రామ, వార్డు సచివాలయాల్లో ఆధార్‌నమోదు చేయించుకోవచ్చు.

సీతారామ ప్రతిష్ఠోత్సవాలు ప్రారంభం

ముదినేపల్లి, మే 2 (ఆంధ్రజ్యోతి) : ముదినేపల్లి మండలం గురజ గ్రామంలో సీతారామాలయ ప్రతిష్ఠోత్సవాలు శుక్రవారం సాయంత్రం ప్రారంభమయ్యాయి. ఆలయం వద్ద విఘ్నేశ్వరపూజ, అంకురార్పణ, వాస్తుపూజ, అఖండ దీపారాధనతో పాటు హోమ పూజలను నిర్వహించారు. వడాలి జగన్నాథస్వామి దేవస్థానం అర్చకుడు అగ్నిహోత్రం శ్రీనివాసాచార్యులు నిర్వహించిన హోమ కార్యక్రమాలను పేర్ని పృథ్వీ, పిట్టల మోహనరావు దంపతులు జరిపించారు. పలువురు భక్తులు పూజలు నిర్వహించారు. ఈనెల 4న నూతన ఆలయంలో విగ్రహాల ప్రతిష్ఠ జరగనుంది.

ఆధ్యాత్మిక భావాలు పెంపొందిస్తాం



చిన్నారులకు కోలాట ప్రదర్శన నేర్పుతున్న దృశ్యం

కైకలూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల్లో విద్యార్థులకు ఆధ్యాత్మిక భావాలు పెంపొందించేందుకు వికాస తరంగణి కృషి చేస్తున్నదని సంస్థ అధ్యక్షురాలు చిట్టి హేమలత అన్నారు. శుక్రవారం కైకలూరు వెంకటేశ్వరస్వామి ఆలయంలో వికాస తరంగణి ఆధ్వర్యంలో ప్రజ్ఞ వేసవి శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా హేమలత మాట్లాడుతూ శిబిరంలో భక్తి సంకీర్తనలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తామని అన్నారు. పిల్లలకు కోలాట ప్రదర్శన ప్రతి రోజూ శిక్షణ ఇచ్చి తీర్చిదిద్దుతామన్నారు. సుమారు 70 మంది పిల్లలు ఈ శిబిరానికి రావడం అభినందనీయమని పేర్కొన్నారు.

చేతి పంపునకు మరమ్మతులు

ముసునూరు, మే 2 (ఆంధ్రజ్యోతి):ముసునూరు బీసీకాలనీలో నిరుపయోగంగా ఉన్న చేతి పంపుకు శుక్రవారం మెకానిక్ సుబ్బారావు, సిబ్బంది మరమ్మతులు చేసి, నూతన సామగ్రిని బిగించి వినియోగంలోకి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఏఈ సత్యప్రసాద్ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఉన్న చేతి పంపులను వినియోగంలోకి తీసుకువచ్చేలా ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు.

బెల్లం ఊట ధ్వంసం

చాట్రాయి, మే 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని మంకొల్లులో శుక్రవారం జరిపిన దాడిలో 400 లీటర్లు బెల్లం ఊటను ధ్వంసం చేసి, ధారావతు భాస్కరరావుపై కేసు నమోదు చేసినట్లు జిల్లా ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ అజయ్‌కుమార్ తెలిపారు.

ఎన్ఆర్ఐలో అంతర్జాతీయ సదస్సు

ఆగిరిపల్లి, మే 2 (ఆంధ్రజ్యోతి): ఆగిరిపల్లి మండలం, పోతవరప్పాడు గ్రామంలో ఎన్ఆర్ఐ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఐసీఆర్ఏఐసీ2ఐటీ 2025 పేరిట 2వ అంతర్జాతీయ సదస్సును కన్వీనర్ అండ్ సీఎస్ఈ విభాగాధిపతి డా.డి. సునీత ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ డిటర్మినిస్టిక్ ఆటోమేషన్ సిస్టమ్‌లు సమాజానికి మేలు చేస్తాయని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని రీసెర్చ్, అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో చీఫ్ గెస్ట్‌గా ఎఫ్ట్రానిక్స్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సిఈవో డా.దాసరి రామకృష్ణ పాల్గొని ఎఫ్ట్రానిక్స్ అభివృద్ధి చేసిన రైల్వే సిగ్నలింగ్ ఆటోమేషన్, స్మార్ట్ మున్సిపల్ లైటింగ్, ఆరోగ్య పర్యవేక్షణ వేదికలు వంటి పరిష్కారాలను ప్రస్తావించారు.

మోదీ ఆశీర్వాదం తీసుకున్న కృష్ణారావు



ప్రధాని మోదీని కలిసిన బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణారావు.. చిత్రంలో సీఎం చంద్రబాబు

ముదినేపల్లి, మే 2 (ఆంధ్రజ్యోతి) : ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని భారతీయ జనతాపార్టీ ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి, ముదినేపల్లికి చెందిన కోటప్రోలు కృష్ణారావు కలిశారు. అమరావతిలో సభ ముగించుకుని తిరిగి ఢిల్లీ వెళుతున్న మోదీని గన్నవరం విమానాశ్రయంలో వీడ్కోలు పలికే కార్యక్రమంలో పాల్గొన్న కృష్ణారావు కలసి ప్రధానిని కలిసి ఆశీర్వచనం తీసుకున్నారు. బీజేపీ సిద్ధాంతాలకు అనుగుణంగా పార్టీ కోసం కృష్ణారావు పని చేస్తున్నారని ఒక నాయకుడు ప్రధానికి పరిచయంచేయగా ఉత్సాహంగా పని చేయాలని ప్రధాని సూచించారని కృష్ణారావు తెలిపారు.

రెండు గడ్డి వాములు దగ్ధం



ముదినేపల్లి, మే 2 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం చినకామనపూడిలో శుక్రవారం జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు వరిగడ్డి వాములు దగ్ధం కాగా సుమారు రూ. లక్ష నష్టం వాటిల్లింది. ఆ గ్రామానికి చెందిన అంగరాకుల నాగరాజు, అతని సోదరుడు అనిల్‌కుమార్‌కు చెందిన సుమారు 8 ఎకరాల్లోని వరిగడ్డిని పశువులకు గ్రాసం కోసం కొనుగోలు చేసి విడివిడిగా ఏర్పాటు చేసుకున్న వాములకు ప్రమాదవశాత్తు నిప్పంటుకుంది. ప్రమాద సమాచారం అందగానే కైకలూరు నుంచి అగ్నిమాపక అధికారి క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది మంటలను అదుపు చేశారు.

జడ్పీ ఉద్యోగులకు పదోన్నతి

ఏలూరు సిటీ, మే 2(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ ఉద్యోగులకు పదోన్నతులు కల్పిస్తూ జారీ చేసిన ఉత్తర్వులను జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ శుక్రవారం అందజేశారు. ముగ్గురు అడ్మినిస్ట్రేటివ్ అధికారులకు ఎంపీడీవోలుగా, సీనియర్ అసిస్టెంట్లకు అడ్మినిస్ట్రేటివ్ అధికారులుగా పదోన్నతి కల్పించారు. పదోన్నతి పొందిన ఉద్యోగులను చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అభినందించారు. ప్రజలకు అత్యంత నిబద్ధతతో సేవలందించాలని సూచించారు. ప్రభుత్వం ప్రజా సంక్షేమా నికి తీసుకుంటున్న చర్యల్లో వారు తమ విశేష పాత్రను పోషించాలన్నారు. పదోన్నతి పొందిన అధికారులు కృతజ్ఞతలు వ్యక్తం చేస్తూ ప్రజలకు ఉత్తమ సేవలు అందించేందుకు అన్ని విధాలుగా శ్రద్ధ వహిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



చాట్రాయి..కైకలూరు.. కలిదిండి.. ముసునూరులలో అమరావతికి బయలుదేరిన కూటమి శ్రేణులు... మర్రిబంధం వద్ద జెండా ఊపి వాహనాలు ప్రారంభిస్తున్న మంత్రి సారథి

అమరావతికి తరలిన కూటమి శ్రేణులు

అమరావతిలో శుక్రవారం జరిగిన ప్రధాన మంత్రి మోదీ సభకు నూజివీడు, కైకలూరు నియోజకవర్గాల నుంచి భారీగా తరలి వెళ్లారు. సీఎం చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కూడా పాల్గొన్న ఈ సభను విజయవంతం చేయడానికి కూటమి నాయకులతో పాటు అధికారులు కృషి చేశారు. జనసమీకరణకు లక్ష్యాలు కేటాయించారు. సభకు వెళ్లడానికి ప్రత్యేకంగా బస్సులు ఏర్పాటు చేశారు. అలాగే పులిహోర, మంచినీరు పంపిణీ చేశారు.

నూజివీడు, మే 2 (ఆంధ్రజ్యోతి): అమరావతిలో శుక్రవారం జరిగిన ప్రధాని మోదీ సభకు నూజివీడు నియోజకవర్గం నుంచి మంత్రి కె.పార్థసారథి ఆధ్వర్యంలో నాయకులు, ప్రజలు తరలివెళ్ళారు. నూజివీడు టౌన్ నుంచి జనంతో బయల్దేరిన ప్రతి వాహనం మర్రిబంధం మీదుగా హనుమాన్‌జంక్షన్ జాతీయ రహదారి పైకి వెళ్ళేవిధంగా రూట్‌మ్యాప్ ఇచ్చారు. ఉదయం 9 గంటల సమయంలో మంత్రి పార్థసారథి మర్రిబంధం వద్ద వాహనాలకు పచ్చజెండా ఊపి ప్రారంభించారు. 170 బస్సులు, వందలాది కార్లలో పదివేల మందికి పైగా ప్రజలు ఈ సభకు నూజివీడు నియోజకవర్గం నుంచి హాజరు అయ్యారు. సభకు వెళ్ళిన వారు ఇబ్బంది పడకుండా తాగునీరు, బిస్కెట్లు, పులిహోర, భోజన ఏర్పాట్లను పార్థసారథి ఏర్పాటు చేశారు.

చాట్రాయి: అమరావతిలో జరిగిన ప్రధాని నరేంద్ర మోదీ సభకు చాట్రాయి మండలం నుంచి తెలుగుదేశం జనసేన బీజేపీ శ్రేణులు బస్సులు, చిన్న కార్లులో భారీగా తరలివెళ్ళారు. చీపురుగూడెంలో అమరావతి వెళ్ళే బస్సుకు మండల టీడీపీ అధ్యక్షురాలు బొట్టు వరలక్ష్మి జెండా ఊపి పంపించారు. బస్సులలో ప్రయాణించే వారికి అధికారులు అల్పాహారం, వాటర్ బాటిల్స్ పంపిణీ చేయగా, టీడీపీ నాయకులు భోజనం, తాగునీటి క్యాన్లు బస్సులకు అందించారు. కూటమి నాయకులు మందపాటి బసవారెడ్డి, మోరంపూడి శ్రీనివాసరావు, బొట్టు రామచంద్రరావు, నోబుల్‌రెడ్డి, అత్తులూరి శ్రీనివాసరావు, మరిడి చిట్టిబాబు, పలగాని దుర్గారావు, బొట్టు లక్ష్మణరావు, కందుల కృష్ణ, మాదాసు చంద్రకళ, వెల్ది నాగేశ్వరరావు, అంబటి సత్యనారాయణ(చంటి) తదితరులు తరలి వెళ్ళారు.

ముసునూరు: మండలంలోని 16 గ్రామాలకు సూమారు 50 బస్సులను ఏర్పాటు చేయగా నాయకులు, కార్యాకర్తలతోపాటు మహిళలు సైతం బస్సులు కిక్కిరిసేలా తరలివెళ్ళారు. ముసునూరులో బస్సులను టీడీపీ మండల అధ్యక్షులు దేవినేని ఢలరాం, నియోజకవర్గ తెలుగుయువత కార్యాదర్శి కొండేటి ఉదయ్ కిరణ్(బాబి)లు పచ్చ జెండాను ఊపి ప్రారంభించారు. రమణక్కపేటలో గ్రామ టీడీపీ అధ్యక్షులు రంగు ఆంజనేయులు, జనసేన నాయకులు పాశం నాగబాబు, యూనిట్ ఇన్‌చార్జ్ రంగు శ్రీనివాస్, వేల్పుచర్లలో మాజీ డీసీ చైర్మన్ తుమ్మల నాగేశ్వరరావు, యువనేత నాని తదితరుల ఆధ్వర్యంలో తరలివెళ్లారు.

ముదినేపల్లి: ముదినేపల్లి మండలం నుంచి ఎన్‌డీఏ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దసంఖ్యలో తరలివెళ్లారు. తెలుగు దేశం పార్టీ కైకలూరు నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, మండల టీడీపీ అధ్యక్షులు చల్లగుళ్ల శోభనాద్రి చౌదరి, ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొడాలి వినోద్, పార్టీ నాయకులు చలసాని జగన్మోహనరావు, పోసిన పాండురంగారావు, దావు నాగరాజు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కృష్ణారావు, మండల పార్టీ అధ్యక్షురాలు సత్యవేలు నాగలక్ష్మీ, నియోజకవర్గ కన్వీనర్ పైడిపాటి శివశంకర్, జనసేన మండల కన్వీనర్ వీరంకి వెంకటేశ్వరరావు తదితరుల నాయకత్వంలో ప్రధాని సభకు వెళ్లారు.

కైకలూరు: కైకలూరు ట్రావెలర్స్ బంగ్లా నుంచి బస్సులు, కార్లలో వెళ్లారు. ఎంపీపీ అడవి వెంకటకృష్ణ, కూటమి నేతలు పెన్మెత్స త్రినాథ్‌రాజు, పొత్తూరి వాసురాజు, పూల రామచంద్రరావు, కొల్లి వరప్రసాద్, బోడావుల జగదీశ్, చెరుకువాడ బలరామరాజు, వీరాబత్తిన సుధ, పడమటి వాసు, పుప్పాల సూర్యప్రకాశరావు తదితరులు వెళ్ళారు.

ప్రధాన మంత్రికి ఎమ్మెల్యే కామినేని స్వాగతం

కైకలూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): అమరావతి పునఃనిర్మాణ సభకు విచ్చేసిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీని సాదరంగా విజయవాడలో హెలి ప్యాడ్ దిగిన వెంటనే ఎమ్మెల్యే కామినేని స్వాగతం పలికారు. కామినేనితో పాటు ఎంపీ సుజనా చౌదరి తదితర నేతలు పాల్గొన్నారు.

కలిదిండి: కలిదిండి మండలం నుంచి జనం, కూటమి నాయకులు, కార్యకర్తలు బస్సుల్లో కార్లు, బైకులపై భారీగా తరలివెళ్లారు. కలిదిండిలో అమరావతికి వెళ్లే బస్సులను ఎంపీడీవో కొండలరావు, తహసీల్దార్ రామకృష్ణ, టీడీపీ మండల అధ్యక్షులు పోకల జోగిరాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభనేని శ్రీనివాస్ చౌదరి జెండా ఊపి ప్రారంభించారు. బస్సుల్లో జనానికి పులి హోర, మజ్జిగ, వాటర్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అంద్రాజు శ్రీనివాస్, డీసీ చైర్మన్లు ముద్దం భోగేశ్వరరావు, పేటేటి సత్యనారాయణ, మాజీ ఎంపీపీ వలవల రామారావు, బీజేపీ నాయకులు చిట్టూరి రవీంద్ర, కోకా శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

మండవల్లి: మండలంలోని లోకుమూడి, చావలిపాడు గ్రామాల నుంచి ఎన్డీఏ కూటమి నాయ కులు, కార్యకర్తలు ప్రైవేట్ బస్సులలో బయలుదేరారు. బీజేపీ మండల పార్టీ ఇన్‌ఛార్జి సమయం ఏసుబాబు, గరికిపాటి రాంబాబు, ఎస్‌కె బాషా, నాగసాయి పాల్గొన్నారు.

లూర్దుమాత ఉత్సవాలకు భక్తుల తాకిడి





ఉత్సవాల్లో పాల్గొన్న క్రైస్తవులు... ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవ బోధకులు

మండవల్లి, మే 2(ఆంధ్రజ్యోతి): మండవల్లి మండలం భైరవపట్నం లూర్దు ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. జిల్లా నలుమూలల నుంచి పెద్ద ఎత్తున వచ్చిన భక్తులతో భైరవపట్నం కిటకిటలాడుతోంది. ఫాదర్ యోహాను, శాంతరాజుల ఆధ్వర్యంలో నిర్వహించిన దివ్య బలిపూజ, స్వస్థత ప్రార్థనలు, క్రీస్తుగీతాల ఆలాపన భక్తులను ఎంతో కట్టిపడేసింది. లూర్దుమాతను దర్శించుకుని ప్రసాదాలను స్వీకరించారు.

బాబు పాలనలోనే అమరావతికి మహర్దశ

నూజివీడు, మే 2 (ఆంధ్రజ్యోతి):రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు హయాంలోనే రాజధాని అమరావతికి మహర్దశ పడుతుందని రాష్ట్రమంత్రి కె.పార్థసారథి అన్నారు. శుక్రవారం ఉదయం మర్రిబంధంలో కార్యకర్తలను ద్దేశించి మాట్లాడారు. అమరావతిలో రూ.49,040 కోట్ల పనులకు ప్రధాని మోదీ శ్రీకారం చుడుతున్నారని తెలిపారు. జి.ఏ.డి టవర్, హెచ్‌వోడి టవర్లు, అసెంబ్లీ భవనం, హైకోర్టు, ప్రధాన రోడ్లు, ట్రంక్‌రోడ్లు, భూగర్భ డ్రెయినేజీ, నీటి సరఫరా, విద్యుత్ సరఫరా పనులు ప్రారంభం కానున్నాయని తెలిపారు. వేలకోట్ల విలువైన కేంద్రప్రభుత్వ ప్రాజెక్టులను, నాగాయలంకలో ఏర్పాటు చేయనున్న మిసైల్ టెస్ట్‌రేంజ్, విశాఖలో పీఎం ఏక్తామాల్ తదితర పనులను సైతం ప్రధాని నేడు శంకుస్థాపన చేయనున్నారని తెలిపారు.

టీడీపీ కార్యకర్తను ఆదుకుంటాం..



రామకృష్ణ కుటుంబాన్ని పరామర్శిస్తున్న మంత్రి సారథి

నూజివీడు, మే 2 (ఆంధ్రజ్యోతి):నూజివీడు మండలం మర్రిబంధం గ్రామంలో ఆకస్మికంగా మృతి చెందిన కె.రామకృష్ణ అనే టీడీపీ సీనియర్ కార్యకర్త కుటుంబ సభ్యులను శుక్రవారం కె.పార్థసారథి పరామర్శించారు. పార్టీ ఈ కుటుం బానికి అన్ని విధాలా అండగా ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. అలాగే ఈ కుటుంబానికి ప్రభుత్వం తరపున వచ్చే సంక్షేమం, ఆర్థిక అభివృద్ధికి పలు వ్యక్తిగత పథకాలు అందేలా సహకరిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట పలువురు టీడీపీ నాయకులు ఉన్నారు.





సింగరాయపాలెంలో బాలికల సమావేశంలో మాట్లాడుతున్న సుందరమ్మ... గోపాలపురం సదస్సులో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రసూన

బాల్య వివాహాలతో అనర్థాలు

ముదినేపల్లి, కలిదిండి మండలాల్లో కిశోర బాలికలకు అవగాహన

ముదినేపల్లి, మే 2 (ఆంధ్రజ్యోతి): బాల్యవివాహం అనర్థదాయకమని ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ సుందరమ్మ తెలిపారు. ముదినేపల్లి మండలం సింగరాయపాలెం గ్రామ సచివాలయంలో శుక్రవారం జరిగిన కిశోర్ వికాసం కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ 18 సంవత్సరాల వయస్సు లోపు వివాహం చేసుకుంటే బాలికలకు ఎదురయ్యే అనర్థాలను వివరించారు. పరిపక్వత లేని బాలికలకు వివాహం చేయటంలో తల్లిదండ్రులు సాహసం చేయవద్దని అన్నారు. జీఎస్ఎంకె రోహిణి, వెల్ఫేర్ అసిస్టెంట్ తేజ, అంగన్‌వాడీ టీచర్ రత్నతులసీ, సముద్రవేణి, రిబ్కా పాల్గొన్నారు.

కలిదిండి: కిశోరి బాలికలు బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సిహెచ్.ప్రసూన అన్నారు. శుక్రవారం కిశోరి వికాసం - వేసవి శిక్షణ కార్యక్రమంలో భాగంగా గోపాలపురంలో కిశోరి బాలికలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 11 సంవత్సరాల నుంచి 18 సంవత్సరాల వయస్సు గల కిశోరి బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలని, ఆరోగ్యవంతులుగా ఉండాలన్నారు. మానసికంగా ధృడంగా ఉండాలన్నారు. ఉన్నత చదువులను అభ్యసించి విద్యావంతులుగా ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అనపర్తి వడ్డీ కాసులు, వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

నిండిన తాగునీటి చెరువులు



కొండంగిలో నిండిన తాగునీటి చెరువు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కలిదిండి మే 2 (ఆంధ్రజ్యోతి): లంక గ్రామాలైన కొండంగి, మట్టగుంట, పెదలంక గ్రామాల్లో అడుగంటిన తాగునీటి చెరువులను అధికారులు నీటి సంఘాల అధ్యక్షుల సహకారంతో పూర్తిస్థాయిలో నింపారు. ఆంధ్రజ్యోతిలో ఈ నెల 27న ప్రచురితమైన లంక గ్రామాల్లో అడుగంటిన తాగునీటి చెరువులు శీర్షికన కథనానికి అధికారులు స్పందించారు. కోరుకొల్లు లాకుల నుంచి నీబీ కెనాల్‌కు తాగునీటిని విడుదల చేసి ఆయా గ్రామాల్లో అడుగంటిన తాగునీటి చెరువులకు నీటి వంతు ఇచ్చారు. డీసీ చైర్మన్ ముద్దం భోగేశ్వరరావు, నీటి సంఘాల అధ్యక్షులు, గ్రామస్థులు రేయింబవళ్లు కాల్వ వెంబడి మూడు రోజులపాటు కాపలా కాస్తూ యుద్ధప్రాతిపదికన మోటార్లతో తాగునీటి చెరువులను నింపారు.

మార్కెట్‌లో పేదవాడి ఫ్రిజ్‌లు



మట్టి కుండలు వేసవి కాలం రాగానే పేదవారి ఫ్రిజ్‌లుగా మారిపోతాయి. చల్లదనంతోపాటు ఆరోగ్యకరమై నీరు మట్టికుండల్లో లభిస్తుంది. ఎలక్ట్రానిక్ ఫ్రిజ్‌లను అత్యధిక ధరలకు కొనుగోలు చేయలేని వారు మట్టి కుండలనే ఫ్రిజ్‌లుగా ఉపయోగించుకుంటారు. వేసవి కాలం రాగానే ఈ కుండలకు డిమాండ్ పెరుగుతుంది. ముదినేపల్లి ప్రాంతంలో ప్రతి ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడ మట్టి కుండలకు గిరాకీ పెరిగింది. సైజును బట్టి కుండలు రూ.150 నుంచి రూ.300 వరకు అమ్ముతున్నారు. వేసవికాలంలో మట్టి కుండల్లో నిలువ చేసే నీరు చల్లగా ఉంటుంది. సన్నని మెడతో పొడవుగా తయారు చేసే కుండలను కూజా అంటారు. నీళ్లల్లో ఉండే సూక్ష్మక్రిములను కూడ మట్టి కుండలు నిర్మూలించి స్వచ్ఛమైన తాగునీరు అందిస్తున్నందున ఇప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలతోపాటు పట్టణాల్లో కొంత మంది మట్టి కుండల్లో నీరు నిల్వ చేసుకుని తాగుతుంటారు.

- ముదినేపల్లి

ఉపాధికి వచ్చి ప్రాణాలు కోల్పోయాడు

గుండెపోటుతో కూలీ మృతి

ముదినేపల్లి, మే 2 (ఆంధ్రజ్యోతి) : జీవనోపాధి కోసం దూర ప్రాంతం నుంచి వచ్చిన ఓ యువకుడు గుండె పోటుకు గురై అకస్మాత్తుగా మరణించిన సంఘటన ముదినేపల్లి మండలం వడాలి గ్రామంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం విజయనగరం జిల్లా కొత్తడామ్ గ్రామానికి చెందిన సీరపు దినేష్ (30) పామర్రు దిగమర్రు జాతీయ రహదారి విస్తరణలో విద్యుత్ లైన్ల ఏర్పాటు పనుల్లో పని చేస్తున్నాడు. ఇతర వర్కర్లతో కలసి వడాలి గ్రామంలో నివాసం ఉంటున్నాడు. పనులు ముగించుకుని గురువారం రాత్రి వడాలి నివాసానికి చేరిన దినేష్ బాత్‌రూమ్‌కు వెళ్ళి కుప్పకూలి పడిపోయాడు. వెంటనే స్థానికులు, స్నేహితులు, అతనిని గుడివాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా గుండె పోటుకు గురై అప్పటికే చనిపోయినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి హెచ్‌సీపీ శంకరరావు దర్యాప్తు చేస్తున్నారు.

పురుగుల మందు తాగి ఒకరు..

ఏలూరు క్రైం, మే 2(ఆంధ్రజ్యోతి): ఏకారణమో తెలియదు కాని ఒక వ్యక్తి పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ముసునూరు మండలం వత్రంపాడులో జరిగింది. గ్రామానికి చెందిన మరీదు రాంబాబు(38)కి భార్య, పిల్లలు ఉన్నారు. శుక్రవారం పొలంలో పురుగుల మందు తాగి పడిపోగా ఇరుగుపొరుగు వారు చూసి ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకు వచ్చారు. చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం మృతి చెందాడు. ఈ ఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీ నమోదు చేసి ఆసుపత్రి అవుట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	124, 133, 144
చికెన్ విత్ స్కిన్	234
చికెన్ స్కిన్‌లెస్	244

నెక్ కోడి గుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.475



హైవే నాణ్యత ప్రమాణాలు పరిశీలన

మండవల్లి, మే 2(ఆంధ్రజ్యోతి): నాణ్యతా ప్రమాణాలు తగ్గకుండా రహదారి నిర్మాణ పనులు చేస్తున్నామని నేషనల్ హైవే ఏఈ శరత్ పేర్కొన్నారు. మండవల్లి గ్రామంలో 165వ జాతీయ రహదారి నిర్మాణ నాణ్యతా ప్రమాణాన్ని శుక్రవారం ఆయన క్వాలిటీ ఇంజనీర్ భానుప్రసాద్‌తో కలిసి పరిశీలించారు. పూర్వ కాంట్రాక్టర్ ఆలసత్వం, జాప్యం వల్ల నిర్మాణ పనులు ఆలస్యమయ్యాయని ప్రభుత్వం పనులను మరొక కాంట్రాక్టర్‌కు అప్పగించడంతో పనులను చురుగ్గా సాగుతున్నాయని ఆయన తెలిపారు.

మొక్కజొన్న రైతులకు నష్ట పరిహారం చెల్లించాలి



భవిష్యత్ కార్యాచరణపై కౌలు రైతులతో చర్చిస్తున్న సీపీఐ నాయకుడు రామారావు

నూజివీడు, మే 2 (ఆంధ్రజ్యోతి): హైబ్రీడ్ మొక్కజొన్న విత్తనం వల్ల నష్టపోయిన కౌలు రైతులకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలని సీపీఐ రాష్ట్రసమితి నాయకుడు చలసాని వెంకటరామారావు డిమాండ్ చేశారు. శుక్రవారం నూజివీడు అమర్‌భవన్‌లో నూజివీడు మండలం బోర్వంచ గ్రామ కౌలురైతులతో జరిపిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒక కంపెనీ హైబ్రీడ్ మొక్కజొన్న విత్తనాలతో బోర్వంచ గ్రామంలో 27మంది కౌలురైతులు 68 ఎకరాలు సాగు చేయగా, సగటున కేవలం టన్నున్నర మాత్రమే దిగుబడి వచ్చి రైతులకు తీవ్ర నష్టం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. కంపెనీ వారు రైతులకు ఎకరానికి నాలుగు నుంచి 5 టన్నుల దిగుబడి వస్తుందని ఆశలు కల్పించి పంట వేయించారని, ఇప్పుడు రైతులు నష్టపరిహారం అడిగితే మోహం చాటేస్తున్నారన్నారు. ఈ సమస్య పై సోమవారం నాడు నూజివీడు సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద బాధిత రైతులతో ఆందోళన నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు నిమ్మగడ్డ నరసింహ, మడుపల్లి నాగేంద్రరావు, బొప్పుడి రాంబాబు, బాధిత రైతులు పాల్గొన్నారు.